నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మహబూబ్‌నగర్
బుధవారం | అక్టోబర్ 02. 2024 | www.navatelangana.com

వయో వృద్ధులను ఆదరించడం కుటుంబ సభ్యుల బాధ్యత

- కలెక్టర్ విజయేందిర బోయి

నవ తెలంగాణ- మహబూబ్ నగర్



వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ ,సంక్షేమం తో పాటు వారిని ఆదరించడం కుటుంబ సభ్యుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం లో మహిళా,శిశు ,వయో వృద్ధుల,దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధాప్యం రెండో బాల్యం లాంటిదని,పిల్లల తో సమానంగా వయో వృద్ధులను కూడా కుటుంబ సభ్యులు జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు.వయో వృద్ధులను,తల్లి దండ్రులను కుటుంబ సభ్యులు ఏ విధంగా చూసుకుంటారో పిల్లలు కూడా రోల్ మోడల్ గా తీసుకుంటారని అన్నారు.ఉద్యోగ,వ్యాపార,ఇంటి బాధ్యత లతో వృద్ధులైన తల్లి దండ్రుల తో సరిగా మాట్లాడలేక పోవడం వారికి లోటుగా అనిపిస్తుందని,వారితో ప్రేమగా మాట్లాడి ఆదరించాలని అన్నారు.రిటైర్మెంట్ తర్వాత సెకండ్ లైఫ్ మొదలవుతుందని, వయో వృద్ధులను సంరక్షణకు ప్రభుత్వం తో పాటు వాయి వృద్ధుల పొరంలు సహకారం ముఖ్యమని ఆమె అన్నారు.వయో వృద్ధులు కుటుంబ సభ్యుల నుండి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ సంరక్షణకు ఆర్.డి. ఓ ట్రిబ్యునల్ ను సంప్రదించాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరపున వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు హెల్త్ క్యాంపులు,గ్రాండ్ పేరెంట్స్ డే ను పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్ రావు మాట్లాడుతూ వయో వృద్ధుల సంరక్షణ కు ఆర్.డి.ఓ ట్రిబ్యునల్,అప్పీల్ కు కలెక్టర్ కు దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. అదనపు ఎస్.పి.రాములు మాట్లాడుతూ వయో వృద్ధుల సంరక్షణ కు పోలీస్ శాఖ తరపున అండగా ఉంటామని,వారికి భద్రతా పరంగాఏ సమస్య ఎదురైనా 100 కు ఫోన్ చేస్తే పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ సమావేశం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.పద్మ, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి జరీనా ,డి.ఆర్.డి.ఓ నర్సింహులు,పశు వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ మధు సూదన్,సీనియర్ సిటిజన్ వెల్ ఫేర్ ఫోరం అధ్యక్షులు జగపతి రావు, కార్యదర్శి నాగ భూషణం,పెన్ష నర్ అసోసియేషన్ అధ్యక్షులు సాయి గౌడ్, వయో వృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు నాగేంద్ర స్వామి,జడ్చర్ల సీనియర్ సిటిజన్ వెల్ ఫేర్ ఫోరం నయీ మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల : అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు కల్వకుర్తి రోడ్డులో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో వార్డ్ కౌన్సిలర్ దేశవాలిసతీష్ కుమార్ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కి సన్మానించారు. కార్యక్రమంలో జడ్చర్ల విజయ్ కుమార్, మాజీ చైర్మన్ కాత్రపల్లి లక్ష్మయ్య సీనియర్ నాయకులు అయ్యన్న రిటైర్డ్ టీచర్లు నయూముద్దీన్ జమీల,సత్యనారాయణ రెడ్డి ఆశీర్వాదం , వ్యాపారస్తులు మిరియాల వేణుగోపాల్ , దత్తు, పాల్గొన్నారు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ -మిడ్జిల్

మండల కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ ప్రవేట్, పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీచర్లు విద్యార్థులు పూలతో బతు కమ్మను బతుకమ్మ పాటలు పాడుతూ విద్యా ర్థులు ఆటపాట్లతో సాగనంపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి బాట పట్టిన విద్యార్థులు

నవతెలంగాణ బాలానగర్



దసరా పండుగ రావటంతో ఈనెల రెండవ తేదీ నుండి 14వ తేదీ వరకు దసరా సెలవులు రావడంతో దసరా సెలవులు రావడంతో ఒకరోజు ముందు గానే తమ తమ ఇండ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. బాలానగర్ మండల కేంద్రంలో బాలికల గురుకుల పాఠశాల. ఏకలవ్య గురుకుల పాఠశాల. ప్రభుత్వ పాఠశాలలు సెలవు ప్రకటించడంతో తమతమ గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. వారికి సౌకర్యం ఉన్న తీరురైల్వే.బసౌకర్యం ఉన్నవారు. ఆయా గ్రామాలకు బయలుదేరి వెళ్లారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



నవ తెలంగాణ మహబూబ్ నగర్

వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా ప్రభుత్వ జనరల్ దవఖాన మంగళవారం 51 మది రక్తదానం చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ రక్తదానం చేయడం మరొకరికి ప్రాణదానం చేయడంతో సమానమని పేర్కొన్నారు. యువత అంతా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని తెలిపారు శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పద్మావతి , పాథాలజీ విభాగాధిపతి, ఆర్ఎంఓ డాక్టర్ జరీనా, రాములు నాయక్, ఆర్ ఎం ఓ డాక్టర్ గణేష్ , హెల్త్ సూపర్వైజర్ వెంకటేష్ , టెక్నీషియన్ కురుమయ్య ఇతరులు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడి కేసు నమోదు

నవతెలంగాణ- నవాబ్‌పేట

మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ఓ మహిళ పై అదే గ్రామానికి చెందిన దండు మైభు అను వ్యక్తి గత నెల 23తేదీన మహిళా తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రాత్రి 10: 30 లకు ఒకదాన్ని చూసి ఇంట్లోకి చొరబడి ఒంటరిగా ఉన్నప్పుడు బలవంతంగా శారీరకంగా కలిసాడని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని ఆమె భర్తతో కలిసి మంగళవారం నవాబ్ పేట పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.ఈ విషయం పై మహిళా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

నూతన ఎంఈఓగా రాజు నాయక్

నవతెలంగాణ మహమ్మదాబాద్

మండలానికి ఇటీవల నూతన ఎంఈఓగా నియమితులైన రాజు నాయక్ ని మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు,ఏటీఆర్ పాఠశాల అంజిరెడ్డి,ఏంజెల్ వాలి పాఠశాల మోన్ చంద్, శ్రీఅక్షర పాఠశాల రాజేందర్ రెడ్డి,మంగళవారం మండల కేంద్రంలోని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పల్లవి స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్,రాఘవేందర్,శ్రీనివాస్ పాల్గొన్నారు

ఆపద జర్నలిస్టులకు అండగా ఉందాం

-ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు బాల్ రెడ్డి

నవతెలంగాణ- మిడ్జిల్



ఆపదలో ఉన్న జర్నలిస్టులకు అండగా ఉండాలని ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు బాల్ రెడ్డి అన్నారు. వెలుగు న్యూస్ పేపర్ విలేఖరి మల్లేష్ తల్లి మృతి చెందడంతో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 15 వేల రూపాయలు మల్లేష్ స్థానిక విలేక రులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్లేష్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడమే ప్రతి జర్నలిస్టు బాధ్యతని తెలిపారు. మల్లేష్ తల్లి మరణం కుటుంబానికి తీరంలో గాని ఆయన కుటుంబ అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరులు, రాజేష్ కుమార్ ,మహేష్ ,రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాసులు ,సుందర్ చారి, పరంజ్యోతి, సత్యం గౌడ్, శ్రీనివాసులు, భీమ్ రాజు, అశోక్, కేశవ్, విజయ్ , నందం, రవి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హిసేవలో నవాబ్ పేటకు ఉత్తమ అవార్డు

- వ్యర్థాలతో వస్తువులను తయారీ విధానాన్ని అభినందించిన కలెక్టర్

నవతెలంగాణ-నవాబ్ పేట



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో ఐడీఓసీ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నవాబ్ పేట మండలానికి ఉత్తమ అవార్డు లభించింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని మండల ఎంపీఓ బద్రునాయక్ ఐసీడీఎస్ సూపర్వైజర్ లు అందుకున్నారు.ఈ సందర్భంగా స్వచ్ఛతా హిసేవ కార్యక్రమానికి సంబంధించి మండల కేంద్రంలోని అంగన్వాడీ కార్యకర్తలు విద్యార్థులు కలిసి వాడుకుని పడేసే వ్యర్థాలతో అనేక రకాల వస్తువులను ఆట బొమ్మలు గృహోపకరణాలు తదితర వస్తువులను తయారు చేసి ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి అక్కడ ఏర్పాటు చేసిన వస్తువులు చూసి వారిని అభినందించారు.వాటిని తయారు చేయడానికి కృషి చేసిన వారికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ భద్రు నాయక్ ,సూపర్వైజర్ రాజరాజేశ్వరీ, మండల కేంద్రంలోని అంగన్వాడీ కార్యకర్తలు ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి

- బీజేపీ హిందుత్వ రాజ్యాంగాన్ని అడ్డుకోవడమే లక్ష్యం
- వామపక్షాల పోరాటాలు.బలం పెరగాలి
- సీతారాం ఏచూరి సంస్మరణ సభలో నాయకుల అభిప్రాయాలు

విలువలతో కూడిన రాజకీయాలు ఏచూరివి



దేశ రాజకీయాలలో ఎంత మంది గొప్ప నాయకులు ఉన్న చివరికి వారి జీవితం తెరిచి చూస్తే విలువలకు స్థానం ఉండదు. నేటి తరం మాలాంట వారు సీతారాం ఏచూరి చూపించిన దారిలో నడవాలని అనుకున్న నడవ లేకపోతున్నామన్నారు. ఆయన జీవిత చరిత్రను రాబోయే తరాలకు అందించడం ద్వారా ఒక మంచి రాజకీయాలను చూస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జి.మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే



విద్యార్థి దశ నుండి ఊపిరి పోయేంతవరకు భారతదేశ లౌకిక ప్రజాస్వామ్య సామ్యవాద రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు నిరంతర పోరాట స్ఫూర్తి అయినది. బహిరంగ సభలైన చట్టాసభలైన ,రాజకీయ శిక్షణ తరగతులైన, ప్రజలు వాడే పదునైన భాషలు వారికి అర్థమయ్యే రీతిలో ఆయన ప్రసంగాలు. ఇందిరా గాంధీని ఎదిరించింది అతడే, ప్రైవేటు బీమా పెట్టుబడుల చట్టా పత్రాలు పార్లమెంటులో చించింది అతడే సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అంటూ సభలో పలువురు సందేశమిచ్చారు. భారతదేశ ఆర్థిక రాజకీయ అంశాలను క్షుణంగా అధ్యయనం చేసి దేశానికి బీజేపీ ప్రమాదాన్ని గుర్తించిన గొప్ప మేధావి అని అభివర్ణించారు.చుట్టూ ఉన్న దేశాలలో ఎర్ర జెండాలు ఎగురుతున్న ఈ తరుణంలో భారతదేశంలో వామపక్ష మార్క్సిస్టు పార్టీ మేధావులు పెరగాలని, ఉద్యమాలు నిర్మించాలని, చట్టసభల్లో బలం పెరిగినప్పుడే కార్మిక, కర్షకులు, పేదలందరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవనంలో మంగళవారం సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రాములు అధ్యక్షతన జరిగింది. ముందుగా నాయకులు అంబేద్కర్ విగ్రహానికి, సీతారాం ఏచూరి చిత్రపటం దగ్గర సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కే గోపాల్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నవతెలంగాణ- మహబూబ్‌నగర్





దేశ భవిష్యత్ కోసమే ఏచూరి తపన



సీతారాం ఏచూరి తెలుగు రాష్ట్రాలలో సుపరిచితుడని దేశంలో ఎంతో గొప్ప పేరు తెచ్చుకున్న నాయకుడని వారు అన్నారు. నాకు 2022 జులై 22న జైపాల్ రెడ్డి సంస్మరణ సభ కల్వకుర్తిలో ఆయనను కలి శారని వారు అన్నారు. జయప్రకాశ్ నారాయణ కాలేజీ స్థాపనలో నేను ఢిల్లీలో ఉన్నప్పుడు జయపాల్ రెడ్డితో కలిసి అనేకసార్లు సీతారాం ఏచూరితో కలిసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అతడు ఒక ధన్యజీవి అని నాకు ఇక్కడ వామపక్ష భావాలు రావడానికి బాలకృష్ణ గౌడ్ ఒక స్ఫూర్తి అన్నారు.

జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ రవికుమార్

ఫ్రంట్ లు ఏర్పాటు చేయడంలో ఏ చూరిదే కీలక పాత్ర



దేశ రాజకీయాలలో మతోన్మాద రాజకీయాలను అడ్డుకునేందుకు సీతారాం ఏచూరి వామపక్ష పార్టీలను కలుపుకొని ఫ్రంట్ లు ఏర్పాటు చేయడంలో కీలక భూమిక పోషించారని తెలిపారు.అభ్యుదయ లౌకిక శక్తులను ఏకమై బీజేపీ హిందుత్వ రాజ్యాంగ ఎజెండాను అడ్డుకోవడమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళిని తెలిపారు. అదే భారతదేశంలో 140 కోట్ల ప్రజలు కోరుకుంటున్నారని వారు అన్నారు.

రామకృష్ణ ,సీపీఐ సీనియర్ నాయకులు



వామపక్షాల ఐక్య ఉద్యమాలు పెరగాలి



సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చూపించిన దారిలో వామపక్ష పార్టీలు కలిసి ఉద్యమాలు నిర్మించాలని అప్పుడే మతోన్మాద రాజకీయాలను ఎదుర్కొంటామని తెలిపారు.

బాలకిషన్ ,సీపీఐ జిల్లా కార్యదర్శి



ఏచూరిది నిస్వార్థ సేవ



పేద ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసి ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా జీవించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని ఆయన గుర్తు చేశారు. పేద ప్రజల పక్షాన చట్టసభలలో గలమెక్కిన గొప్ప మేధావిగా ఆయన అభి వర్ణించారు.

బెక్కం జనార్ధన్, ప్రముఖ న్యాయవాది



ఒక మరణం ఒక గొప్ప వ్యక్తి చరిత్ర తెలుపుతుంది



సీతారాం ఏచూరి అంటే నాకు ఇప్పటివరకు తెలియదు కానీ అతని మరణం ఈ దేశంలో కోట్లాదిమంది ప్రజలు ఆయన గురించి మాట్లాడుతూ ఉంటే ఆయన ఎంత గొప్ప వ్యక్తి నాకు అర్థం అయిందన్నారు. విద్యార్థి దశ నుండి తుది శ్వాస తీర్చే వరకు ఒకే లక్ష్యం ఒకే ఆశయం కోసం జీవించిన అతని గురించి చరిత్ర పుట్టలోకి ఎక్కించాలని ఆయన కోరారు.

ఆనంద్ కుమార్ గౌడ్,మున్సిపల్ చైర్మన్

ఉదండాపూర్ అక్రమాలు గుర్తించడానికి ఇల్లిల్లూ తిరుగుతా

- అధికారులు కూడా అప్రమత్తం గా ఉండాలి
- అక్రమాలు ఎవరు చేసినా వదిలి పెట్టను
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ

నవతెలంగాణ- జడ్చర్ల

ఉదండాపూర్ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో అక్రమాలు అడ్డుకోవడానికి, బోగస్ వ్యక్తులను గుర్తించడానికి అవసరమైతే తాను ఇల్లిల్లూ తిరుగుతానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు ప్రాంతాల్లో భూములకు, గ్రామాల్లో కుటుంబాలకు పరిహారం చెల్లింపులో గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ కు చెందిన నాయకులు అక్రమాలు చేయడానికి భూముల రికార్డులను ట్యాంపర్ చేసి ప్రభుత్వ భూములను కూడా తమవిగా చూపించి పరిహారం మొత్తాలను తీసుకోవడం తో పాటు ఇతరుల భూములకు సంబంధించి రావాల్సిన మొత్తాలను కూడా తమ బినామీ ఖాతాల కు మళ్లించుకున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని



మంగళవారం మీడియా కు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. అలాగే ఆర్ అండ్ ఆర్ కింద వచ్చే పరిహారాన్ని కూడా స్వాహా చేయడానికి గ్రామానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లతో బోగస్ కుటుంబాలను కూడా జాబితాలో చేర్చారని కూడా తన దృష్టికి వచ్చిందని చెప్పారు. అయితే ఇలాంటి అక్రమాలు ఎవరు చేసినా, వాటి వెనుక ఎంతటి పెద్ద మనుషులు ఉన్నా తాను సహించనని స్పష్టం చేశారు. పోలేపల్లి పంచాయితీ లో జరిగిన అక్రమాలను గురించి తాను అధికారులకు ఫిర్యాదు చేయడం, అధికారుల విచారణలో అవి నిజమేనని తేలిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాబోయే ఆరు నెలల కాలంలో ఉదందాపూర్ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో అధికారులు కూడా అవార్డు పాస్ చేయడానికి ముందుగానే అక్రమాలు గుర్తించి వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయాలని కోరారు. అక్రమాలకు అధికారులు సహకరించిన దాఖలాలు ఉంటే వారిపై కూడా చర్యలకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. బోగస్ కుటుంబాలను గుర్తించడానికి తానే స్వయంగా ఇల్లిల్లూ తిరుగుతానని ప్రకటించారు. ఈ విషయం లో జరిగిన అక్రమాలను గురించి తన దృష్టికి తీసుకురావాలని, బాధితులు జడ్చర్ల లోని తన క్యాంపు కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని అనిరుధ్ రెడ్డి సూచించారు.

పత్రాల పరిశీలన గందరగోళం

- అభ్యర్థులకు మెసేజ్‌లు, అధికారులకు లిస్టులు రాకుండానే పరిశీలన ఎలా
- సెలవులకు ముందు చివరి పని రోజుల్లో ఉపాధ్యాయులకు కష్టాలు
- అందోళనలో కాబోయే అధ్యాపకులు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

బుధవారం నుంచి దసరా సెలవులు ప్రారంబం కానున్నాయి. అయితే పాఠశాలలకు మంగళవారమే చివరి రోజు. ధృవ పత్రాల పరిశీలనకు జీహెచ్ఎంసీలకు అవకాశం ఇచ్చారు. పాఠశాలలకు చివరి రోజు కావడం చేత తప్పనిసరిగా అక్కడ విధులు నిర్వహించాలి. ధృవపత్రాల పరిశీలనకు రావడంతో పాఠ శాలల్లో గందర గోలం ఏర్పడింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 285 పోస్టులు ఉన్నాయి. వీటికోసం 10072 మంది డీఎస్‌సీ రాశారు. ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున 855 మంది ధృవీకరణ పత్రాలను పరిశీలించాల్సి ఉంది.ఇక మహబూబ్‌నగర్ జిల్లాలో 843 ఖాళీలు ఉన్నాయి. డిఎస్‌సిలో 7525 మంది పరీక్షలు రాశారు. వీరిలో 729 మంది ధృవపత్రాలను పరిశీలించాల్సి ఉంది. నారాయణపేటలో 279 ఖాళీలకు డీఎస్సీలో 5972 మంది పరీక్షలు రాశారు.873 మంది ధృవ పత్రాలను పరిశీలించాల్సింది. గద్వాలలో 172 పోస్టులకు డీఎస్‌సీలో 6474 మంది పరీక్షలు రాశారు.ఇందులో 516 మంది ధృవపత్రాలను పరిశీలించాల్సి ఉంది. వనపర్తిలో 152 పోస్టులకు గాను 2137 మంది డీఎస్‌సీ రాశారు. 456 మంది ధృవపత్రాలను పరిశీలించిల్సి ఉంది.



అంతా గందరగోళం

డీఎస్సీ రాసి అర్హత సంపాదించిన వారిలో సగం మందికి పైగానే ప్రభుత్వం నుంచి మెసేజ్‌లు రాలేదు. దీంతో అనేక మంది గందరగోళంలో ఉన్నారు. మద్యం వరకు ధృవపత్రాల పరిశీలన కోసం కౌంటర్‌లు ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా ఎడ్యుకేషన్ డైరెక్టర్ బోర్డు నుండి ఒక పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల లిస్టు జిల్లా కేంద్రాలకు ఆలస్యంగా చేరింది. దీంతో అభ్యర్థులు గంటల తరబడి పడిగాపులు గాచారు.ధృవపత్రాల పరిశీలన ఉందని తెలిసి జాబితా కోసం అనేక మంది డీఇఓ కార్యాలయాలకు వచ్చారు. కొంత మందికి తమ పేర్లు లిస్టులో లేవని తెలిసి వెనుదిరిగి పోయారు. అధికారులు తగు జాగ్రతలు తీసుకుంటే ఇలాంటి సమస్య లు వచ్చేవి కావని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను బర్తీ చేయడానికి నిర్వహించిన డీఎస్సీ ఫలితాలు సోమవారం విడుదల చేశారు. మంగళవారం ఒక పోస్టుకు ముగ్గురి చొప్పున ధృవపత్రాల పరిశీలన చేయడానికి ముహుర్తం ఖరారు చేశారు. ఎన్నో ఎళ్ల నిరీక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఖళీల బర్తీ చేయనుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒక పోస్టుకు ముగ్గురి చొప్పున ధృవపత్రాల పరిశీలన చేస్తామని చెప్పి ఏర్పాట్లను మరిచారు. దీంతో అభ్యర్థులు గందర గోళంలో పడ్డారు. ఒక పోస్టుకు అర్హత సంపాదించిన ముగ్గురికి మంగళవారం మధ్యహ్నాం అయినా... వారికి మెసేజ్‌లు రాలేదని ధృవపత్రాల పరిశీలన సైతం అస్తవ్యవస్థంగా ఉందని అభ్యర్థులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధృవీకరణ పత్రాల పరిశీలనయ విషయంలో ప్రభుత్వం తగు జాగ్రతలు తీసుకోవాలి.

నేడు డీఎస్‌సీ రాసిన వారి ధృవపత్రాలను పరిశీలిస్తామని చెప్పారు. అందుకు అర్హులయిన వారు డీఇఓ కేంద్రానికి చేరుకున్నారు. మద్యహ్నం దాటినా.. మెరిట్ లిస్టు రాకపోవడం సరికాదు. లిస్టులో ఎవరి పేర్లు ఉన్నాయో తెలియక అధికారులు సైతం ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా ధృవీకరణ పత్రాల విషయంలో ముందే తగు జాగ్రతలు తీసుకుంటే ఇటువంటి సమస్యలు రావు.

ఎస్. కిష్టయ్య,
విశ్రాంతి ఉపాధ్యాయులు, మహబూబ్‌నగర్

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ- వీపనగండ్ల

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే సందర్భంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉండేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్స్ హేమవర్ధన్, కరుణశ్రీ, భాగ్యశ్రీ, శ్వేత సూపర్‌వైజర్ దయమని, సీహెచ్ఈ కేశవులు, డీఈవో రాఘవేందర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ చిన్నారిని ఆదుకోరూ..



నవతెలంగాణ- మదనాపురం

మదనాపురం మండలం తిర్మలాయ పల్లి గ్రామానికి చెందిన విలేకరి రవి, మనీషా కూతురు గీతికాదేవి ప్రాంక్రియాస్ వ్యాధితో భాధపడుతోంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న తల్లిదండ్రులు బంధు మిత్రుల సాయంతో చికిత్స అందించారు. కాగా చిన్నారికి శస్త్రచికిత్స అవసరమని అందుకు రూ.3లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. ఇప్పటికే తమ దగ్గర ఉన్న డబ్బు వైద్యం కోసం ఖర్చు చేశామని, ఎవరైనా దాతలు ముందుకొచ్చి సాయం చేస్తేనే ఆపరేషన్ చేయించే దయనీయ పరిస్థితిలో ఉన్నామని తల్లిదండ్రులు కనీటి పర్యతమవుతున్నారు. దాతలు మానవత్వంతో ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం చేసి చిన్నారిని ఆదుకోవాలని తల్లిదండ్రులతో పాటు బంధు మిత్రులు కోరుతున్నారు.

కుటుంబ సభ్యుల వివరాల సేకరణ చేపట్టాలి

- రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-వనపర్తి

ఒక రాష్ట్రం ఒక గుర్తింపు కార్డు జారీకై పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి నియోజకవర్గం నుండి ఒక గ్రామ పంచాయతీ, ఒక మున్సిపల్ వార్డులో కుటుంబ సభ్యుల వివరాల సేకరణ చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మంగళవారం హైదారాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కుటుంబానికి ఒక గుర్తింపు నెంబరు ఇచ్చి కుటుంబంలోని సభ్యులకు వ్యక్తిగత గుర్తింపు నెంబరుతో కార్డు జారీ చేయాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యుల వివరాలు పకడ్బందీగా సేకరించి తప్పులు లేకుండా నిర్ణీత ప్రొఫార్మాలో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అక్టోబర్ 3 నుండి 8వ తేది వరకు వివరాల సేకరణ పూర్తి చేసి అక్టోబర్ 10న నివేదిక పంపించాల్సిందిగా సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్డీఓ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని, పైలెట్ ప్రాజెక్టు పూర్తి అయ్యాక రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తికి ఒక గుర్తింపు కార్డు జారీ చేసేందుకు కార్యాచరణ చేపట్టడం జరుగుతుందన్నారు. కుటుంబంలో పెద్ద వయస్సు కలిగిన మహిళను కుటుంబ యజమానిగా గుర్తించాల్సి ఉంటుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రతి జిల్లా నుండి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి నివేదికను గురువారం లోపు పంపించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై సమీక్ష నిర్వహిస్తూ ఇప్పటివరకు 5 శాతం పూర్తికా లేదని, ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నిబంధనల మేరకు ఉన్న లేఅవుట్లు, ప్లాట్లను త్వరగా రెగ్యులరైజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు ఎల్ ఆర్ఎస్ రెగ్యులరైజేషన్‌కు కమిటీలు వేశామని వారు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా నుండి రెండు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు పంపించేందుకు చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. ఒక రాష్ట్రం ఒక కార్డు కార్యక్రమాన్ని జిల్లాలో నిబంధనల మేరకు వివరాల సేకరణ చేపట్టడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, యం.నగేష్, ఆర్డీఓ పద్మావతి, రెవెన్యూ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్ తదితరు లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, అధికారులు

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి
- పెబ్బేర్ మార్కెట్ యార్డు సందర్శన



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-పెబ్బేరు

రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెబ్బేర్ మార్కెట్ యార్డ్‌ను ఆయన డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. మార్కెట్ పాలకవర్గం రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, మార్కెట్లో రైతులు అసౌకర్యానికి గురికాకుండా చూస ుకోవాలన్నారు. అనంతరం మార్కెట్ చైర్‌పర్సన్ గౌని ప్రమోదిని పాండేశ్వరిరెడ్డి, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్దన్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు రామన్‌గౌడ్, మెతే రాములు, యుగంధర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాముడు, గుడిసె రమేష్ ఎండీ.జాంగీర్ మిద్దె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

- బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకలు

నవతెలంగాణ-వనపర్తి

వనపర్తి జిల్లా ప్రజల చిరకాలవాంఛ అయిన రోడ్ల విస్తరణకు స్థానిక ప్రజలను ఒప్పించి, మెప్పించి దిగ్విజయంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పూర్తి చేసారని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జోహేబ్ హుస్సేన్ అన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇంటిదగ్గర మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ చేపట్టడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని పేర్కొన్నారు. రోడ్డు వెంబడి ఉన్న నివాసగృహాలకు నష్టపరిహారంగా డబల్ బెడ్ రూమ్స్ కేటాయించారన్నారు. తాత్కాలికంగా కిరాయి ఉన్న కొందరికి సొంత నిధులతో వారికి ఇంటి అద్దె ఇచ్చారన్నారు. రోడ్ల మీద ఉన్న మజీద్, ఆలయాలు తదితరులకు ప్రత్యా మ్నాయంగా స్థలాలు ఇప్పించారన్నారు. అందులో భాగంగానే నూరీ మజీద్ దగ్గర కోల్పోయిన షాప్‌లకు ప్రత్యామ్నాయంగా పంచాయత్ కార్యాలయం ఆవ రణలో స్థలం మున్సిపల్ తీర్మానంతో పాటు అప్పటి కలెక్టర్ ప్రొసీడింగ్ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ఆ స్థలం ముస్లిం మైనార్టీలకు ఇవ్వడానికి నేటి ప్రభుత్వం నిరాకరించడాన్ని బీఆర్ఎస్ మైనారిటీ సెల్ తీవ్రంగా ఖండిస్తుం దన్నారు. కాబట్టి వెంటనే గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, స్టార్ రహీమ్, సయ్యద్ జమీల్, ఎండీ.గౌస్, వహీద్, ఆరీఫ్, ఏకేపాషా, అలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి



తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం ఇస్తున్న వై శాఖాపూర్ గ్రామస్తులు

నవతెలంగాణ -పెబ్బేరు

విద్యుత్ సమస్యను పరిష్కరించాలంటూ మండలంలోని వైశాఖపూర్ గ్రామస్తులు మంగళవారం మండల అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై శాఖాపూర్ ఫీడర్ కింది గ్రామాల్లో కరెంటు కోతలు ఎక్కువయ్యాయన్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు. నిరంతరం కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈసమస్య తొలగిపోవాలంటే తోమాలపల్లె సబ్‌స్టేషన్ త్వరగా ప్రారంభించి వై శాఖాపూర్ గ్రామంతో పాటు తోమాలపల్లె, రాంపురం, రామమ్మపేట గ్రామాల్లో కరెంటు సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మి, విద్యుత్ ఏఈ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖాపూర్ గ్రామస్తులు వీ.వెంకటన్న గౌడ్, సందకేశవ్, పరమేష్ నాయి, గువ్వల గోపి, మరాటి రాకేష్, వడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ - ఆత్మకూర్

ఆత్మకూరు మండలంలోని వీరరాఘవపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకుడు వెంకటన్న మాతృ మూర్తి మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ దహన సంస్కారాల కోసం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో రేచింతల పీఏసీఎస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి , వీరేశలింగం, ఏం.రామకృష్ణ, రఘువర్దన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శారదా నరేష్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు కొండన్న, ఉపాధ్యక్షులు మొగులన్న ఉన్నారు.

అన్ని సదుపాయాలతో పోషక పునరావాస కేంద్రం

- స్యామ్, మ్యామ్ పిల్లల ఆరోగ్య పరిరక్షణకు సద్వినియోగం చేసుకోవాలి
- వైద్య విద్యార్థులకు ఆధునిక శస్త్ర చికిత్స గది ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

నవతెలంగాణ-వనపర్తి

నర్సింగాయపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులు, వైద్య సిబ్బందితో పోషక పునరావాస కేంద్రం (ఎన్ఆర్సీ) ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో ఎత్తుకు తగ్గ బరువు, వయస్సుకు తగ్గ ఎదుగుదల లేని పిల్లలు వైద్య సేవలు పొందాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. 5 పడకల వసతితో అన్ని మౌలిక వసతులతో ఏర్పాటుచేసిన ఎన్.ఆర్.సి కేంద్రంలో చిన్న పిల్లలు ఎతుకు తగ్గ బరువు లేకపోవడం, వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవడం, రక్త హీనత వంటి రుగ్మతలతో బాధపడుతున్న పిల్లలను ఎన్ఆర్సి సెంటర్‌లో చేర్పి పిల్లలకు ఉచితంగా పౌష్టికాహారం, నిపుణులైన వైద్యులతో వైద్య సేవలు పొందాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రితో పాటు నర్సింగాయపల్లి వద్ద గల మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ముందుగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలో అవుట్ పేషంట్ విభాగం, లేబర్ వార్డు, పురుషుల వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్యుల ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని వసతులతో శస్త్ర చికిత్స ఆపరేషన్ థియేటర్‌ను సిద్ధం చేయాలని, అత్యవసర సేవల కొరకు ఆసుపత్రికి వచ్చే రోగులకు శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు వైద్య కళాశాల విద్యార్థుల శిక్షణకు ఉపయోగపడే విధంగా రూపొందించాలని సూచించారు. అదేవిధంగా ట్రామాకేర్ యూనిట్ సైతం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతు, మార్పు చేర్పులు పనులు త్వరగా పూర్తి చేయాలని టిఎస్ఎం ఐడీసీ సహాయ ఇంజినీర్ శివను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగారావు, చిన్న పిల్లల వైద్యులు డా.చంద్రమోహన్, ఏఈ శివ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాలికల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

నవతెలంగాణ-పెబ్బేరు

బాలికలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా సమస్యవస్తే ధైర్యంగా ఎదుర్కోవాలని షీటీం సిబ్బంది అన్నారు. మంగళవారం పెబ్బేరు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీం, భరోసా టీం, హెల్ప్ లైన్ టీం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఎస్సై మాట్లాడుతూ అమ్మాయిలు వాట్స్ అప్,ఫేస్‌బుక్‌లో కొత్త వ్యక్తులను పరచయాలు చేసుకోవద్దన్నారు. ఇంట్లో బైయట ఎవరి నుంచైనా ఇబ్బందులు ఎదురైతే షీటీంకు సమాచారం ఇవ్వలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికావొద్దన్నారు. మనకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం, ఫోటోస్‌ను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయవద్దన్నారు. తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రిన్సిపల్ భద్రాసేన్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో ఉండాలని, సమాజంలో మన చుట్టూ జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అమ్మాయిలు ఏ చిన్న సమస్య వచ్చినా షీ టీంకు వెంటనే కాల్ చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చక్కగా చదువుకుంటూ సమాజంలో బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. నేటి ప్రపంచంలో సాంకేతిక టెక్నాలజీలతో వాట్సాప్ ద్వారా ఫేస్‌బుక్, మెసేజ్ ద్వారా అమ్మాయిలను కొందరు ట్రాప్ చేస్తున్నారని అలంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, అతిగా ఫోన్లు చూడవద్దని, తరగతి గదులకు ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఎలా ఉంటున్నారో గమనిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం, హెల్ప్ లైన్ టీం సభ్యులు, కళాశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకేసి వక్కేసి సందమామ..

- పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబురాలు
- ఆటా పాటలతో అలరించిన విద్యార్థినులు



ఆత్మకూరు శ్రీవాణి పాఠశాలలో..



వీపనగండ్లలో బతుకమ ఆడుతున్న విద్యార్థినులు

నవతెలంగాణ- వీపనగండ్ల

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్, డాపో డీల్స్ ప్రైవేట్ పాఠశాలతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను తయా రుచేసి ఆట పాటలతో ఉత్సాహంగా ఆడిపా డారు. అనంతరం బతుకమ్మలను ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యా యులు భానుప్రకాష్, మంజులదేవి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సాయిలత, ఉపాధ్యాయులు ఆనంద్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాసులు, రాజ, స్వప్న, కవిత, డాపో డీల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.రాముడు, ఉపాధ్యాయులు లక్ష్మి, రాజేశ్వరి, మాసుంబీ, మౌనిక, అస్వతి, భాస్కర్ వివిధ గ్రామాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూర్: పట్టణంలోని శ్రీవాణి హైస్కూల్‌లో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటా పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లతా, ఉపాధ్యాయులు గంగాధర్, అభిలాష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి



నవతెలంగాణ- పెబ్బేరు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయి అన్నారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 10వ వార్డులో పరిస రాల పరిశుభ్రత, సీజనల్ వ్యాదుల పై అవగాహ న కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మున్సిపల్ సిబ్బందితో కలిసి వార్డులో ఇంటికీకి తిరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని అనారోగ్య సమస్యలపైన అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పద్మ, మున్సిపల్ కమిషనర్ కె.ఆదిశేషు, స్పెషల్ ఆఫీసర్ మీరాజ్ అహ్మద్, మేనేజర్ గణేష్ బాబు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేష్ కుమార్, వార్డు ఆఫీసర్ సునీత, శిరీష, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరులో ..

ఆత్మకూరు: పట్టణంలో మంగళవారం కలెక్టర్ ఆదేశానుసారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నాలుగో వార్డ్‌లో కాలువలను శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, వార్డు ప్రజలకు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కలించారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు, వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ మహేశ్వరి, ఆర్పీలు, వైద్య సిబ్బంది మరియు అంగన్‌వాడీ టీచర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

టీఎస్ పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ- వీపనగండ్ల

వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో వీపనగండ్ల మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆనంద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఖాసిం, అసోసియేట్ కార్యదర్శిగా శ్రీనివాసులు, మహిళా కార్యదర్శిగా శ్వేతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బౌద్ధరెడ్డి, ఉపాధ్యక్షులు జయంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, తిరుపతయ్య, బండిశ్రీను పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌నగర్ శాఖ కార్యదర్శిగా బీసన్న



నవతెలంగాణ- వనపర్తి

వనపర్తి జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ నగర్ సీపీఎం శాఖ కార్యదర్శిగా ఎల్.బీసన్న ఎన్నికయ్యారు. భగత్‌సింగ్‌నగర్ శాఖ కార్యదర్శిగా వరుసగా ఆరుమార్లు ఎన్నిక కావడం గర్వంగా ఉందని, పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేస్తానని బీసన్న తెలిపారు. భగత్ సింగ్ నగర్, తిరుమలకాలనీ, శ్వేతానగర్, గణేష్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజల సమస్యలపై సీపీఎం గత మూడు సంవత్సరాలుగా చేసిన కార్యక్రమాలను సమీక్షించుకొని నూతన కర్తవ్యాలను తీసుకున్నట్లు తెలిపారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలను కదిలించి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

టీజీఎస్ఎస్‌కు విద్యార్థినుల ఎంపిక

- అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-మదనాపురం

మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామ భారతి టాలెంట్ స్కూల్ విద్యార్థినులు పల్లెపాగ శ్రావ్య, అక్కల శ్రీనిజ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ ఎండీ ఖాజామైనొద్దీన్, పాధ్యాయ సిబ్బంది విద్యార్థినునులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు శ్రావ్య, శ్రీనిజ ప్రతిభ కనపరచి హకీంపేటలో నిర్వ హించిన రాష్ట్రస్థాయి ఈవెంట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచి హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారన్నారు. జిల్లా నుంచి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన ఐదుగురిలో మా విద్యార్థినులు ఉండడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమన్నారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది రజియా బేగం, సత్యావతమ్మ, అలివేలు, మమత, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్, ఓనర్స్ కమిటీ ఎన్నిక



ఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీ సభ్యులు

నవతెలంగాణ -ఆత్మకూర్

అమరచింత పట్టణంలో మంగళవారం డ్రైవర్స్ మరియు ఓనర్స్ యూనియన్ కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి ఆర్.ఎస్.రమేష్, ఎస్.అజయ్ తెలిపారు. అధ్యక్షుడిగా నిస్సర్, ఉపాధ్యక్షులుగా రాము, ప్రధాన కార్యదర్శిగా రఘు, సహాయకార్యదర్శి రమేష్ కోశాధికారిగా వెంకీ, సభ్యులుగా ఓంపల్లి నాగరాజు, వినోద్, కతాల్, రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్స్ దిక్కు తోచని పరిస్థితిలో పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.12వేలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని, ఆటో ఇన్సూరెన్స్ కూడా ప్రభుత్వమే చెల్లించాలని. ప్రతి డ్రైవర్‌కు 10లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు.



పేద విద్యార్థులకు అండగా ఐక్యత ఫౌండేషన్

• టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి

నవతెలంగాణ-వెల్దండ

పేద విద్యార్థుల చదువులకు అండగా ఉండడమే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు నిర్వహించిన కృతజ్ఞతా సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, అధ్యా పక బృందం ఆయనను ఘనంగా సన్మానించారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యం లో పాఠశాలలో విద్యార్థుల మరుగుదొడ్ల మరమ్మత్తు చేయించడం పట్ల ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలో నెలకొన్న మరిన్ని సమస్యలు పరిష్కరించే దిశగా ఐక్యత ఫౌండేషన్ కృషి చేయాలని పాఠశాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పాఠశాల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు సైతం భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.రాఘవేందర్ రెడ్డి పిలుపుమేరకు బిజినపల్లి గ్రామానికి చెందిన రాములు అనే విద్యార్థి తండ్రి రూ.5వేల విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జానకి, ఫౌండేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిర్వహణ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దు

• భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు



నవతెలంగాణ-కల్వకుర్తి టౌన్

భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిర్వహణను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటైన వెల్ఫేర్ బోర్డు నిధులను నిబంధనలకు విరుద్ధంగా వివిధ శాఖలకు మళ్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రమాద వశాత్తు చనిపోయిన కార్మికులకు రూ.6 లక్షల 30 వేలు, సహజ మరణానికి రూ.లక్షా 30 వేలు, పెండ్లి కానుక కింద రూ.30వేలు, ప్రసూతి కానుకల కింద రూ.30వేలు చెల్లిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, ఇన్సూరెన్స్ రెన్యువల్ కేవలం 15లక్షల మంది మాత్రమే చేసుకున్నారన్నారు. కార్మికులకు ప్రభుత్వం అవగాహన కల్పించి 100 శాతం ఇన్సూరెన్స్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులను ఇతర రంగాలకు మళ్లించడం సమంజసంకాదన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు యాదయ్య, ప్రభాకర్, రాజు, దర్శన్ రెడ్డి, వెంకటయ్య, జంగయ్య, కృష్ణ, బాల మల్లయ్య, రాజు గౌడ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు సరఫరాపై శిక్షణ

నవతెలంగాణ-ఉప్పునుంతల



మిషన్ భగీరథ నీరు సరఫరాపై గ్రామపంచాయతీ మల్టీ వర్కర్స్ శిక్షణలో ముఖ్యఅతిథిగా గ్రిడ్ డీఈఈ సుదర్శన్ పాల్గొని పరిశీలించారు. గ్రామాలలో తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మోటార్ల నిర్వహణ వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, చేతిపంపుల మరమ్మత్తులపై శిక్షణ ఇచ్చారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 4 రోజులపాటు ఈ శిక్షణ నిర్వహిస్తుందని, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి నల్ల కనెక్షన్ ద్వారా మీరు సరఫరా మిషన్ భగీరథ నీటిపై ప్రజలలో నమ్మకం కలిగించాలని సూచించారు. సాయి కృష్ణ, ఎంపీడీవో, ఎంపీవో ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బిజినేపల్లి

మండలంలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన లేట్ల దానయ్య అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచి మల్లికార్జున నాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని చెప్పి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట లేట్ల ఉదయ్, బంగారయ్య, వట్టెం చెన్నయ్య, లేట్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలలో సూర్యప్రకాష్ రావు విజయం

నవతెలంగాణ-కల్వకుర్తి టౌన్

కల్వకుర్తి పట్టణ సమీపంలోని సూర్యలత స్పిన్నింగ్ మిల్లులో మంగళవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలలో బీఆర్ఎస్ నాయకుడు సూర్య ప్రకాష్ రావు సంచలన విజయం సాధించాడు. ఐఎన్‌టీయూసీ అభ్యర్థి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్‌పై 68 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికలను ఇరు పార్టీల నాయకులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు సాగారు. స్పిన్నింగ్ మిల్లులో 450 ఓట్లకు గాను 439 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి సూర్యప్రకాష్ రావుకు 251 కోట్లు రాగా ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఆనంద్ కుమార్‌కు 183 ఓట్లు వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. సూర్య ప్రకాష్ రావు విజయం కోసం బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. ఇరు పార్టీల నాయకులు కార్మికులను క్యాంపులకు తరలించి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసినట్లు సమాచారం.

ఒకరి దానం.. మరొకరికి ప్రాణదానం

• జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రచ్చ రఘు

కందనూలు : ఒకరి దానం.. మరొకరికి ప్రాణదానమని ప్రతి ఒక్కరు రక్త దానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రచ్చ రఘు అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా జనరల్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ నందు రెడ్‌క్రాస్ సొసైటి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్య క్రమంలో ఆర్ఎంఓలు డా.దశరథ్, డా.రోహిత్, రెడ్‌క్రాస్ సొసైటి సెక్రటరీ రమేష్ రెడ్డి, జిల్లా యూత్ కన్వీనర్ కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దండ : మండల పరిధిలోని పోతపల్లి గ్రామానికి చెందిన భూషరాజు స్వామి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ యువ నాయకులు తగుళ్ల కొండల్ యాదవ్ పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం మృతుని కుమారుడు వరుణ్‌కు అందజేశారు. ఆయన వెంట కొండల్ యాదవ్, శివ, సాయిబాబా, మల్లేష్, తదితరులున్నారు.

'విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలి'

కొల్లాపూర్ : విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని శ్రీ గాయత్రి ఎడ్యుకేషన్స్ చైర్మెన్ సురగౌని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని మహాదేవి డిగ్రీ కళాశాలలో ప్రిన్సి పాల్ గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డేకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సురేష్ బాబుకు సన్మానం



పెద్దకొత్తపల్లి : సోమవారం వెలుబడిన డీఎస్సీ ఫలితాలలో పెద్దకారపాముల గ్రామానికి చెందిన సురేష్ బాబు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో 74.23 మార్కులతో జిల్లాలో మూడో ర్యాంకును సాధించాడని సింగిల్ విండో వైస్ చైర్మన్ మెరుగు రాజు యాదవ్ అన్నారు. ఇతను నిరుపేద కుటుంబంలో పుట్టి పట్టుదలతో చదివి మూడో ర్యాంక్ సాధించినందుకు తోటి స్నేహితులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మునిపాల సురేష్ బాబును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వరలక్ష్మి, ఖాసీం, నరేష్, రాజేందర్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు జియావుద్దీన్, ఉపాధ్యాయుడు నాగపురి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

పెంట్లవెల్లి : మండలంలో ఆలస్యంగా మృత్యుఘటన వెలుగు చూసింది. ఎస్సై రామన్ గౌడ్ కథనం ప్రకారం పెంట్లవెల్లి గ్రామానికి చెందిన జంగిటి ఆంజనేయులు(35) సోమవారం చౌట చెరువులో చేపల వేటకు వెళ్లి అదుపు తప్పి నీటిలో పడిపోవడంతో మృతి చెందాడని, మృతునికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారని వారు తెలిపారు. మృతుని తల్లి జంగిటి లక్ష్మి మంగళవారం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి మృతుని గుర్తించారు.

పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-కందనూలు



మహిళలు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని పెద్ద ముదునూరు గ్రామంలో గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి శ్రీరామ మిల్క్ పార్లర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను ఆదుకునేందుకు అనేక రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. డ్వాక్రా రుణాలతో పాటు వివిధ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని గ్రామంలో పది మందికి ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికంగా కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. వ్యాపారంలో రాణించేందుకు మెలకువలను పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మాజీ ఎంపీటీసీ రమణ రావు, మాజీ సర్పంచ్ స్వామి, శ్రీకాంత్ రావు, భగవంత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

• కలెక్టర్ బాదావత్ సంతోష్



నవతెలంగాణ-కందనూలు

హైదరాబాద్ నుండి రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి మంగళవారం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డబల్ బెడ్‌రూమ్, ధాన్యం తదితర అంశాలపై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరం నుండి కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లకు ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 7 వరకు 5రోజుల పాటు పైలెట్ ప్రాజెక్టు చేపట్టే ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు అందరూ సమ్మతిస్తే ఫోటో తీయాలని, అది ఒక ఆప్షన్‌గా మాత్రమే ఉండాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక అర్బన్, రూరల్ ప్రాంతాలను ప్రాతిపదికగా ఎంపిక చేసుకుని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన 238 ప్రాంతాల్లో బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. డిజిటల్ కార్డుల కోసం చేపడుతున్న పైలెట్ ప్రాజెక్టు ద్వారా వెల్లడయ్యే అనుభవాల ఆధారంగా సానుకూల, ప్రతికూల అంశాలపై సమగ్రమైన నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీపై జిల్లాలోని దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని విధాల అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టే కుటుంబ డిజిటల్ కార్డుల గుర్తింపు కార్డులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారి పర్యవేక్షణ ఉంటుందన్నారు.క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించి నమోదు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ రామ్మోహన్‌రావు, నాలుగు నియోజకవర్గాల ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పరిశీలన



మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లేఔట్ రెగ్యులేషన్ స్కీమ్‌లో భాగంగా గతంలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న బండారి జయమ్మ ప్లాటును కలెక్టర్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని సర్వేనెంబర్ 73 నందు ప్లాట్ నెంబర్ 35ను పరిశీలించారు. పంచాయతీ సెక్రటరీ శశికళను ప్లాటు వివరాలు, ఈసీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత దరఖాస్తులను అధికారులందరూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన దరఖాస్తుల్లో న్యాయబద్ధంగా ఉన్న దరఖాస్తులను వెంటనే ఆమోదించాలన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, అధికారులు ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేసేందుకు నిర్దేశించుకున్న ప్రణాళిక మొదలగు వివరాలను న్యాయపరమైన చిక్కులను జాగ్రత్తగా పరిశీలించి దరఖాస్తుల రెగ్యులరేషన్ ప్రక్రియ కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ వరలక్ష్మి, ఏడబ్ల్యుఓ వెంకన్న ఎంపీఓ భరత్, పాల్గొన్నారు.

మనసు, సమాజం స్వచ్ఛంగా ఉండాలి

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్ బాబు

నవతెలంగాణ-కందనూలు

మహాత్మాగాంధీ ఆశించిన స్వచ్ఛభారత్ కల సాకారం కావాలంటే సమాజంతో పాటు ప్రతీ వ్యక్తి మనసు కూడా స్వచ్ఛంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్ బాబు అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు, అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం జిల్లా కోర్టు నుంచి ర్యాలీగా బయలుదేరి మున్సిపల్ పార్క్ వద్ద ఉన్న మహాత్మా గాంధీజీ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో మిగతా న్యాయమూర్తులతో కలిసి శుభ్రం చేశారు. సీనియర్ సివిల్ జడ్జి సబిత మాట్లాడుతూ ప్రజలందరూ మహాత్మా గాంధీజీ ఆదర్శంగా తీసుకొని, ముందుకు పోతే దేశం ప్రపంచ దేశాల మన భారతదేశం ఒక మోడల్ దేశం అవుతుందన్నారు. న్యాయమూర్తులు సబిత, మౌనిక, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



తెలకపల్లి : వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతోనే



రోగాల నివారణ సాధ్యమని సీఎల్ఆర్ విద్యాసంస్థ కరస్పాండెంట్ వి.రాజమహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్వచ్ఛత హీ సేవ 2024 కార్యక్రమంలో భాగంగా విద్యాసంస్థలో అధ్యాపకులు విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. విద్యాసంస్థ ప్రాంగణంలో గ్రామంలోని రోడ్ల కిరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో విద్యాసంస్థ ప్రిన్సిపాల్స్ మర్యాద ప్రకాష్ రెడ్డి, ఎస్.సందీప్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ పవన్‌కుమార్‌పై చర్య తీసుకోవాలి

• కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న

నవతెలంగాణ-కందనూలు



జిల్లా కేంద్రంలోని మంగళవారం ప్రిజం స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న మహమూద్ తాఖీర్‌ను చితకబాదిన టీచర్ పవన్‌కుమార్‌పై చర్య తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఈఓ గోవిందరాజులు జిల్లా కేంద్రంలో ప్రిజం స్కూల్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని, పుస్తకాలకు, డ్రస్సులకు స్కూల్ అని అమ్ముతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూలుపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రిజం స్కూల్ నడుస్తున్న బస్సులు ఫిట్నెస్ లేవని, విద్యార్థులకు సరిపోను గదులు లేవన్నారు. జిల్లా కేంద్రంలో ప్రైవేటు పాఠశా లలు పుట్టగొడుగుల సిండికేట్లుగా ఏర్పడి పేద విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. చదువు చెప్పే టీచర్లు విద్యార్థులను చితకబాదకళం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో మోసం, తాహెర్, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా 50శాతం రైతులకు రుణమాఫీ అమలు చేయాలి

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు

నవతెలంగాణ-కొల్లాపూర్

ఇంకా 50శాతం మిగిలిఉన్న రైతులకు వెంటనే రుణమాఫీ అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్ డిమండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఎండి.సలీం అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా 50శాతానికి పైగా మిగిలి ఉన్న రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో



వేసే రైతు భరోసాను ఇప్పటికి రబీ సీజన్ ప్రారంభమైన కూడా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదును జమ చేయకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని ఎద్దేవ చేశారు. కాబట్టి తక్షణమే రైతు భరోసా నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు రకాల సాంకేతిక కారణాలతో మూడు విడతల్లో మాఫీ గాని రైతులకు వెంటనే సర్వే నిర్వహించి మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సింగల్ విండోలలో, ప్రభుత్వ బ్యాంకులలో రైతులకు రుణాలు ఉన్న వ్యవసాయ శాఖ సైట్‌లో రుణం లేనట్టు ఇంకో రకంగా సింగల్ విండోలలో బ్యాంకుల్లో రుణం లేకపోయినా వ్యవసాయ శాఖ సైట్‌లో రుణాలు ఉన్నట్టు బ్యాంకుల్లో తక్కువ రుణం ఉంటే మాఫీ ఎక్కువ ఉన్నట్టు రకరకాలుగా ఇబ్బందులు ఉన్నాయని, వాటన్నిటిని వెంటనే బ్యాంకు అధికారులు వ్యవసాయ శాఖ వాళ్ళు సమన్వయంతో సరిచేసి అర్హత ఉన్న ప్రతి రైతు కూడా వెంటనే రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా రుణాలు మాఫీ కానీ రైతులందరిని సమీకరించి కలెక్టర్ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బి.శివవర్మ, జిల్లా నాయకుడు ఎం.దశరథం, మండల కమిటీ సభ్యులు బాలపీరు, ఎం.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

బిజినేపల్లి : మండలంలోని వట్టెంలో జవహర్ నవోదయ విద్యాలయులో 2025-26 విద్యాసంవత్సరం 9వ, 11వ తరగతులలో ఖాళీగా వున్న సీట్లలో ప్రవేశానికి గాను అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 30 చివరి తేదీ అని ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకో వాలని, 2025-26 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షకు హాజరు కాబోయే అభ్యర్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ మే 1, 2010 నుంచి జూలై 31, 2012 మధ్య జన్మించి ఉండాలని, 11వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చదువుతూ జూన్ 1,2008 నుంచి జూలై 31,2010 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏదేని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు ఉచితంగా **www.navodaya.gov.in** ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే వారి తల్లిదండ్రుల నివాసం ఉమ్మడి జిల్లాలోనిదై వుండాలని, రెండు తరగతుల ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8, 2025న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అర్హులైన ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ప్రోత్సహించాలన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-కందనూలు

జిల్లాలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో బతకమ్మ సంబరాలను జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.రాజు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. పాఠశాలలో బతుకమ్మ సంబరాలు వైభవంగా ప్రతి సంవత్సరం ఎంతో ఉత్సాహంతో మైనార్టీ స్కూల్లో కూడా వైభవంగా జరుపుతామని



పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల టీచర్స్ తెలిపారు. అదేవిధంగా బతుకమ్మ సంబరాలలో జిల్లాలోని సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, మెరీడియన్ హై స్కూల్, ప్రిజం స్కూల్,మోడల్ స్కూల్, శాంతినికేతన్ స్కూల్, గీతాంజలి హై స్కూల్, ప్రభుత్వ పాఠశాలల్లో, వెల్ఫేర్ హై స్కూల్‌లో ఘనంగా బతకమ్మ సంబరాలను నిర్వహించారు.

వెల్దండ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో మంగళవారం విజయదశమి పండగ పుర



స్కరించుకో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులున్నారు.

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని పెద్ద కార్వాముల ఉన్నత పాఠశాలలో, చేన్నపరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో, మండల కేంద్రంలోని లిటిల్ బర్డ్స్ స్కూల్లో మంగళవారం పాఠశాలల విద్యార్థినీలతో బతకమ్మ పండుగ సందర్భంగా రంగురంగుల పూలతో బతకమ్మలను చేయించి విద్యార్థినీలు ఉపాధ్యాయనీలతో బతకమ్మ పాటలు పాడించి బతకమ్మ పండగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పెద్ద కార్వాముల ప్రధానోపాధ్యాయులు జియాముద్దీన్, చిన్నపరావుపల్లి ప్రధానోపాధ్యాయుడు శేఖర్ రెడ్డి, లిటిల్ బర్డ్స్ స్కూల్ కరస్పాండెంట్ రఘుపతి రెడ్డి, డైరెక్టర్ కర్ణాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఋతురాజులు, ఉపాధ్యాయులు విద్యార్థినిలున్నారు.

ఏజీపీగా బ్రహ్మేశ్వరరావు

నవతెలంగాణ-కందనోలు

నాగర్‌కర్నూల్ జిల్లా ఏజీపీగా అడ్వకేట్ బ్రహ్మేశ్వరరావు నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపగా ఆయన సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. గౌరవప్రదమైన ఏజీపీ హోదాలో కొనసాగుతూ నిరుపేదల పట్ల సానుకులతతో ఉంటూ న్యాయపరమైన అంశాలలో సముచితన్యాయం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు .కార్యక్రమంలో అడ్వకేట్ అహ్మద్ అలీ, కాంగ్రెస్ నేతలు వెంకటయ్య గౌడ్, హసన్, శ్రీనివాస్ రెడ్డి, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలు శరీర దారుఢ్యానికి ఎంతో అవసరం'



నవతెలంగాణ-వంగూరు

మండల కేంద్రంలోని రంగాపూర్ లో దసర నవరాత్రుల సందర్భంగా సుభాష్ చంద్రబోస్ యువజన సంఘం ఏర్పాటు చేసిన రంగాపూర్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్ క్రికెట్ ప్రారంభించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వంగూరు ఎస్సై మహేందర్, కల్వకుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ మంద రాజేందర్ పాల్గొని క్రికెట్ లీగ్ మ్యాచి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీరా దారుఢ్యానికి క్రీడలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట కాంగ్రెస్ అసెంబ్లీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య రంగాపూర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నా రు. క్రీడల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుటాయన్నారు.

ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇల్లుకూల్చే రాజ్యం

• మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి

నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్

ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇల్లు కూల్చే రాజ్యమని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అంటూ, డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. తమ ప్రభుత్వం దసరా పండుగకు మహిళలకు బతుకమ్మ చీరలు ఇచ్చి గౌరవిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి నాణ్యమైన చీరలు ఇప్పిస్తామని చెప్పి పండుగ సమీపిస్తున్న చీరల పంపిణీపై ఊసేత్తడంలేదని, రైతులకు రైతుబంధును ఇవ్వకుండా బొంద పెట్టారని ఎద్దేవ చేశారు. ఇద్దరు ప్రజా ప్రతినిధులు (తండ్రి, కొడుకు) ఒకే ఇంట్లో ఉండి నియోజకవర్గం అభివృద్ధి చేయకుండా పోలీసులను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తూ 9 మందిని జైలుకు పంపారని, ఇంకా తమ ఓపికను పరీక్షించొద్దని జిల్లా నాయకులను, పోలీసులను హెచ్చరించారు. డిసెంబర్ 9, తర్వాత పరిణామాలు వేరుగా ఉండబోతాయన్నారు. మున్సిపల్ ఆఫీసులో చైర్మన్, వైస్ చైర్మన్ లేకుండా తీర్మాణలు ఎలా చేస్తారని, ఆ తీర్మాణం తిరస్కరించి చైర్మన్ సమక్షంలో మళ్లీ నిర్వహించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఒక ఎజెండా రూపొందించుకొని, ప్రణాళిక ప్రకారం నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుచాలన్నారు.



వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టబోదని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో హైడ్రా పేరుతో పేద ప్రజల ఇళ్లను కూల్చి మహిళల ఉసురు తీస్తున్నారని, ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా సమావేశానికి ముందు, ఇటీవల నాగర్‌కర్నూల్ పట్టణంలో గణేష్ నిమజ్జనం వేడుకల్లో జరిగిన చిన్న గొడవలో బీఆర్ఎస్ యువ నాయకుడు పాలమూరు శివపై అక్రమ కేసు పెట్టి రిమాండ్‌కు పంపగా, సబ్ జైల్‌కు ములాఖత్ భాగంగా పాలమూ రు శివను పరామర్శించి, ధైర్యం చెప్పి వచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకుఅన్యాయం జరగనివ్వం

• డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

తిమ్మాజీపేట : మండల కేంద్రంలోని సింగిల్ విండో పరిధిలో ఉన్న రైతులకు ఎక్కడ అన్యాయం జరగనివ్వమని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సింగిల్ విండోలో నిధుల గోల్ మాల్ సంబంధించి డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డితో పాటు డీజీఎం పురుషోత్తం , ఏజీఎం రమేష్ పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగిల్ విండో బ్యాంకుకు సంబంధించి రికార్డ్స్ అన్ని వారం రోజులలో బిజినపల్లిలో అకౌంట్స్ అన్ని ట్రేస్ అవుట్ చేస్తామన్నారు. సీఈఓ నరేష్‌కు సమాచారం అందిస్తాం. వస్తాడా రాడా అనేది వేచిచూస్తాం చైర్మన్‌కు సమాచారమిచ్చాం, అతను రాలేని పక్షంలో ఉపాధ్యక్షుడు రాందేవ్ రెడ్డికి చార్జి ఇచ్చి మిగతా బాడీ సమక్షంలో కొత్త సీఈఓను అపాయ్మెంట్ చేస్తామని తెలిపారు. ఈ సొసైటీలో చాలా అన్యాయాలు జరిగాయని, ఇందులో నిధులు కాజేసిన చేసిన వారు ఎవరు అనేది ఇప్పుడే నిగ్గు తేల్చలేమన్నారు.

ఒక రైతు వచ్చి రెండు లక్షల 7వేలు రసీదు కట్టిన రసీదు చూపించారు. కానీ బ్యాంకులో జమా కాలేదని మన దృష్టికి వచ్చిందన్నారు. రైతు ఇచ్చిన రషీద్ తీసుకొని బ్యాంకులో వెరిఫై చేస్తామన్నారు. ఆర్‌సీఎస్ ప్రకారం గా కోపరేటివ్ యాక్ట్‌ను ఎవరు తప్పించుకునే వీలు లేదన్నారు. త్వరలో బిజినపల్లి బ్యాంకులో రికార్డ్స్ పరిశీలన చేసి అధ్యక్షుని, ఉపాధ్యక్షుడు పిలుచుకొని బ్యాంకు పరిస్థితులను చక్కదిద్దుకొనికె టైం ఇస్తాను. విండోలో రైతుల డబ్బులు కాజేసిన వారిపై తప్పని సరిగా కేసుల నమోదు చేస్తామన్నారు.ఎవరైనా రైతు డబ్బులు కట్టినట్లు రసీదు ఉండి మళ్లీ డబ్బు కట్టన ట్లు రికార్డులో చూపిస్తే ఆ రిసిప్టుతోని పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అవుతుందన్నారు. ఈ సమావేశంలో విండో ఉపాధ్యక్షుడు రాందేవ్ రెడ్డి వున్నారు.

వయోవృద్ధులకు ఘన సన్మానం



పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని పెద్దకారపాముల గ్రామంలో అంగన్వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధులైన అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతలైన కాల బాలయ్య, గండు ఎల్లమ్మ, కావలి లక్ష్మమ్మ, చంద్రకళ, బాలమ్మ, పల్లె ఉషమ్మలను వారి మనవరాలు, మనవళ్లతో శాలువాలు కప్పించి ఘనంగా సన్మానించినట్లు అంగన్వాడీ, ఆశా వర్కర్ల మండల యూనియన్ అధ్యక్షురాలు నిర్మల తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఒకే సంవత్సరంలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన శివ కుమార్ సోమవారం వెలువడిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెం ట్ సోషల్ స్టడీలో ఉద్యోగం సంపాదించాడు. అదేవిధంగా సోషల్ హాస్టల్ వెల్ఫేర్‌లో ఉద్యోగం సాధించాడని గ్రామ మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్ తెలిపారు. గ్రామానికి, తల్లిదండ్రులకు, మండలానికి పేరు తెచ్చినందుకు మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, ఎంపీటీసీ రవికుమార్, ముచ్చబోతు శంకర్, మల్లేష్, గ్రామస్తులు మండల ప్రజలు శివకుమారును అభినందించారు.

స్వచ్ఛతాహి పై విద్యార్థుల ర్యాలీ



నవ తెలంగాణ - మరికల్

మరికల్ మండల కేంద్రంలో మంగళవారం స్వచ్ఛత హి కార్యక్రమంలో భాగంగా మరికల్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో స్వచ్ఛతాహి కార్యక్రమం పై గ్రామాలల్లో ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో నారాయణపేట జిల్లా శిక్షణ కలెక్టర్ గరీమ నరోలా, మరికల్ మండలం తహసీల్దార్ జమీల్, ఎంపీడీవో కొండన్న, ఎంపీఓ పావని మరికల్ గ్రామ పంచా యతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అఖిలపక్ష నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు న్యాయమైన సేవలందించాలి



నవ తెలంగాణ - ఊట్కూర్

మంచినీటి సహాయకులు పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొని వారి పనిలో మెలకువలు నేర్చుకొని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని మండల ప్రత్యేక అధికారి ఉమాపతి ఎంపీడీవో ధనంజయ గౌడ్ అన్నారు .మంగళవారం మండల కేంద్రమైన ఊట్కూర్ లోని మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం అధికారులు ప్రారంభించారు ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఉమాపతి ఎంపీడీవో ధనుంజయ గౌడ్ ఏఈ మిషన్ భగీరథ వెంకటేష్ ఎంపీ ఓ లక్ష్మీ నరసింహా రాజు శిక్షకులు వెంకటయ్య హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో మంచినీటి సహాయకులు వారి విధులను ఎలా నిర్వర్తించాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొని వారి పనిలో మెలకువలు నేర్చుకొని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరై అధికారులు ఇచ్చే శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాలలోని మంచినీటి సహాయకులు పాల్గొన్నారు

బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాకిటి భీమశంకర్



నవ తెలంగాణ - క్రిష్ణా

బీసీ సేన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాకిటి భీమశంకర్ ముదిరాజ్ ను నియమిస్తూ బిసి దళపతి ఆర్ కృష్ణ , జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ మంగళవారం నియామక పత్రం అందజేశారు. కృష్ణ మండల పరిధి లోని మూడుమాల్ గ్రామానికి చెందిన వాకిటి భీమశంకర్ ను హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ భవనంలో ఆ సంఘ నాయకులు సమావేశం నిర్వహించి తీర్మానించి నియామక పత్రాని అందించినట్లు ఆయన తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు రుణ పడి ఉంటానని బీసీల సర్వతోభిముకానికి నా వంతు కృషి చేస్తాననన్నారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సేలేటి వెంకటేష్, బురుగుపల్లి కృష్ణ యాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

సివిఆర్ భవన్ లో కలిసిన పాత మిత్రులు



నవతెలంగాణ - నారాయణపేట

గత పది సంవత్సరాలు ప్రతిపక్షంలో (కాంగ్రెస్) పాలకపక్ష (బిఆర్ఎస్) ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా, ఆర్టీసీ కార్మికులకు వ్యతిరేకంగా కరోనా సమయంలో కదం తొక్కి, రాహుల్ జూడో యాత్రతో జోడి కట్టి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి నాయకత్వంలో కలిసి పనిచేసిన నూతన జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్, ప్రస్తుత ఏఎంసీ చైర్మన్ సివిఆర్ బంగ్లాలో ఎదురుపడి సంతోషం వ్యక్తం చేసుకుంటూ ఒకరినొకరు గత కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. గ్రంథాలయ చైర్మన్ గా బాధ్యతలు అందుకున్న వార్ల విజయకుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన బండి వేణుగోపాల్. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొనంగేరి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సరైన సమాచారాన్ని రికార్డులు పొందుపరిచాలి



నవ తెలంగాణ - ఊట్కూర్

సరైన విధంగా సమాచారాన్ని రికార్డులు పొందుపరచాలని డీడీఓ ప్రోగ్రాం అధికారి శ్రీ సాయిరాం అన్నారు.మండల కేంద్రమైన ఊట్కూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆశాలు ప్రతి గర్భిణులకు స్త్రీ కి రెగ్యులర్‌గా పరీక్షలు చేయించాలన్నారు. ఎల్ఎంపి, రిజిస్టర్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలోనే జరిగే విధంగా జాగ్రత్త వహిం చాలన్నారు. అదేవిధంగా సీజనల్ డిసీజెస్ లో భాగంగా గృహ మునకు వెళ్ళిన ప్పుడు సరైన విధంగా సమాచారాన్ని రికార్డులలో పొందుపరచాలని సూచించా రు. దీనికి ముందు ఆశలకు సంబంధించిన రికార్డులను అయన పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని ఆరోగ్య విస్తరణాది . కారివిజయకుమార్, పర్య వేక్షకులు నరసింహులు ఫార్మసిస్ట్ శ్రీనివాసులు ఆరోగ్య కార్యకర్తలు-గోవిం దమ్మ,శైలజ,సుజాత మ హేశ్వరి కవిత ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

దర్శన ఆసుపత్రిని తనిఖీ



మరికల్ :మండల కేంద్రంలోగల దర్శన (ప్రైవేట్) ఆసుపత్రిని మంగళ వారం నారాయణపేట జిల్లా డిఎంహెచ్ఓ సౌభాగ్య లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సౌభాగ్య లక్ష్మి మాట్లాడుతూ మరికల్ దర్శన ఆసుపత్రిలో ధృవీకరించబడిన ఓపి రిజిస్టర్ సంఖ్య వెరిఫైడ్ ఐపి రిజిస్టర్ కేస్ షీట్‌లు సమాచారం ఉన్నదని ఆరా తీశారు. డయాగ్నస్టిక్స్ కోసం ధర పట్టిక గుర్చీ ఆరా తీశారు. ఎండి జనరల్ ఫిజిషియన్ నుండి ఎంబిబిఎస్ వరకు నేమ్ బోర్డులో హోదా మార్పు, కన్సల్టెంట్ డాక్టర్ పేర్లు సమయాలు ఆసుపత్రిలో సలహా దారు కన్సల్టెంట్ వైద్యుల అర్హత సర్టిఫికేట్, డైరెక్టర్ అర్హత సర్టిఫికేట్ , అదనపు ఐపి బెడ్‌లను అమలు చేశారు. అత్యవసర సేవలు పలు అంశాలపై వాళ్ల రికార్డులు పరిశీలించారు.

30 పోలీస్ యాక్ట్ అమలు : ఎస్పీ యోగేష్ గౌతమ్



నవతెలంగాణ - నారాయణపేట

శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకుని అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణ పై తక్షణ చర్యలు చేపట్టాలి : కలెక్టర్



నవతెలంగాణ-నారాయణపేట

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసు, రెవెన్యూ, ఆర్టీవో, ఆర్అండ్‌బీఅధికారులు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాలులో రోడ్డు ప్రమాదాల నివారణ పై రోడ్డు సేఫ్టీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెల రోడ్ సేఫ్టీ సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. గత నెలలో నిర్వహించిన సమావేశంలో నోట్ చేసిన రోడ్ సేఫ్టీ పనులు ఏమి చేశారో చెప్పాలని ఆర్ అండ్ బి అధికారులను కోరారు. రోడ్ సేఫ్టీ సమావేశానికి కమిటీకి సంబంధించిన జిల్లాస్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని, వారి స్థానాల్లో వేరే అధికారులను పంపిస్తే గత సమావేశంలో చర్చించిన అంశాలపై వారికి సరైన అవగాహన ఉండదని కలెక్టర్ తెలిపారు. నారాయణపేట నుండి మక్తల్ వెళ్లే రోడ్డు అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత దయనీయమైన రోడ్డు మరెక్కడా ఉండదేమో అని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ రోడ్డు గుండా అంబులెన్స్ వాహనాలను తీసుకురావద్దని, ప్రత్యామ్నాయ రోడ్డు ను ఎంపిక చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ డిఎస్పి నల్లపు లింగయ్య కు సూచించారు. ఆ రోడ్డు వేసిన కాంట్రాక్టర్ పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఈ ఈ దేశ్యా నాయక్ ను ఆదేశించారు. అసలు ఎందుకు ఆ రోడ్డు మరమ్మతు పనులు చేయడం లేదని, ఎందుకు గుంతలు ఏర్పడ్డాయని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. ఆ రోడ్డు మార్గంలో కొన్ని కాలువలు ఉండటంతో వర్షాల వల్ల నీరు పారుతూ గుంతలు ఏర్పడ్డాయని ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. ఇటీవలే ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్ కింద రూ.14 కోట్లతో 26 కిలోమీటర్ల మేర మక్తల్ కొత్త రోడ్డుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని ఆర్ అండ్ బి ఈ ఈ కలెక్టర్ కు తెలిపారు. కాజ్ వే లు, గ్రామ మార్గాల వద్ద సీసీ రోడ్డు వేస్తూ ఒక మీటరు ఎత్తు పెంచి తారు రోడ్డును వేసేలా ఆ ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎన్ హెచ్ ఏ ఈఈ శాలిని మాట్లాడుతూ గత సమావేశంలో జిల్లాలో గుర్తించిన ప్రమాద మలుపు దారులు, డేంజర్ జోన్ల వద్ద రంబల్ స్ట్రిప్, సైన్ బోర్డులు, ప్రమాద నివారణకు అవసరమైన వాటిని ఏర్పాటు చేసెందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి తెలుపుతూ జాతీయ రహదారిపై జరిగే ప్రమా దాలను అరికట్టేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ముఖ్యంగా కృష్ణ కూడలి వద్ద అతివే గంగా వాహనాలు వెళుతున్నాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో చాలా వాహనాలు రాంగ్ రూట్లో వెళ్తున్నాయని,వన్ వే లో వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.మరికల్ మక్తల్, కోస్గి పట్టణాల లో వన్ వే రోడ్ల గురించి కమిటీ ఏర్పాటు చేయాలని ఎస్పీ తెలిపారు. ఇలాంటి మీటింగ్ వల్ల అందరూ కలిసి ఒక రోడ్డు ప్రమాదాన్ని ఆపి, ఒక జీవితాన్ని కాపాడిన వాళ్లం అవుతామని ఆయన పేర్కొన్నారు. సిఐలు మాట్లాడుతూ సర్కిళ్ల వారీగా రోడ్డు ప్రమాదాల కేసుల గురించి వివరించారు. గత నెలలో పోలిస్తే ఈ నెలలో తక్కువ ప్రమాదాలు జరిగినట్టు తెలిపారు. సమావేశంలో ఆర్టీవో మేఘా గాంధీ, ఆర్ అండ్ బి ఈఈ దేశ్యానాయక్, డిఈఈ రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య, స్థానిక మున్సిపల్ కమిషనర్ సునీత, సిఐలు శివశంకర్, చంద్రశేఖర్, కోస్గి ,మక్తల్ మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమతంగా ఉండాలి : ఏఎస్ఐ



నవ తెలంగాణ - మరికల్

మరికల్ మండల పరిధిలోని ఎలిగండ్ల గ్రామంలో ఏఎస్ఐ ఎల్లయ్య ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి, అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, షీ టీమ్స్, ట్రాఫిక్ చట్టాలు, సీసీ కెమెరాల పై మాటల ద్వారా పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు అపద, అత్యవసర సమయలలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలి అని అన్నారు. అలాగే ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురి కాకుండా తస్మాత్ జాగ్రత్త పడాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి లేదా డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. దొంగతనాల నిర్మూలన గురించి గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలు చేయడానికి భయపడతారని అలాగే గ్రామాలలో అసంఘటిత కార్యక్రమాలు నివారించడానికి అవకాశం ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరికైనా వారి పై అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా డయల్100 చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, కళాబృందం సభ్యులు సురేందర్, శేఖర్, లింగన్న, కళ్యాణి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఆశయ సాధనకు కృషి చేద్దాం



నవ తెలంగాణ - ఊట్కూర్

కీర్తి శేషులు మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి ఆశయ సాధన కోసం తామంతా కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ నాయకులు కుటుంబ సభ్యులు అన్నారు మంగళవారం మండల కేంద్రమైన ఊట్కూర్ లోని మాజీ మంత్రి కీర్తి శేషులు ఎల్కోటి ఎల్లారెడ్డి ఇంట్లో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.అలాగే లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు ఆయా కార్యక్రమంలో ఎల్కోటి జనార్దన్ రెడ్డి ఎల్కోటి నారాయణరెడ్డి ఎల్కోటి లక్ష్మీకాంత్ రెడ్డి .స్థానిక మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి అరవింద్ కుమార్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్ రెడ్డి, జగదీష్ గౌడ్ జమీర్ అలీ ఓబులాపూర్ ,వెంకటేష్ గౌడ్,పెద్ద జత్రం నాగిరెడ్డి, కాంగ్రెస్ మక్తల్ పట్టణ నాయకులు స్థానిక కాంగ్రెస్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు

ఊట్కూర్ : స్వర్గీయ మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి చూపిన మార్గంలో నడవాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రమైన ఊట్కూర్ లోని మాజీ మంత్రి స్వర్గీయ ఎల్కోటి ఎల్లారెడ్డి స్వగృహంలో స్వర్గీయ ఎల్కోటి ఎల్లారెడ్డి జన్మదిన వేడుకలో ఆయన పాల్గొని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి స్వర్గీయ ఎల్లారెడ్డి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



ఘనంగా పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



నవ తెలంగాణ - క్రిష్ణా

దసరా సందర్భంగా మొదలయ్యే బతుకమ్మ ఉత్సవాలను మండల కేంద్రంలోని శ్రీ జ్ఞాన సంగమ ప్రైవేట్ పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముదు మాలలో బాల, బాలికలు వివిధ రకాల పూలను తీసుకువచ్చి పాఠశాలలో బతుకమ్మలను పేర్చి అట్టహాసంగా బతుకమ్మ సంబరం జరుపుకున్నారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యం చేశారు. బుధవారం నుండి పాఠశాలలు, కళాశాలకు దసరా సెలవుల సందర్భంగా మంగళవారం చివరి పనిదినం కావడంతో విద్యాసంస్థలో అందరూ కలిసి జరుపుకున్న ఈ పండుగ సందర్భంగా, బతుకమ్మ పాటలు, విద్యార్థుల కేరింతలతో ఆ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామస్తులు వీక్షించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివరాజ్ పాటిల్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు ఉన్నారు.

మరికల్ :మండల కేంద్రంలో ప్రభుత్వ బాలికల, బాలురు ఉన్నత పాఠశాల ఆవరణ యందు ఎంఈఓ మనోరంజని, జెడ్ పి హెచ్ నాగరత్న ఆధ్వర్యంలో విద్యార్థులు సెలవు రావడంతో ఒక్కరోజు ముందే పాఠశాల ఆవరణ యందు మంగళవారం బతుకమ్మ ఉత్స వాలు నిర్వహించారు.ఎంఈఓ మనోరంజని, హెచ్ఎం నాగ రత్న, విద్యార్థుల చేత డ్యాన్స్, ఆటలు, బతు కమ్మ పాటలు కలెక్టర్ చూసి ఆనందించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ జెమిలు, ఎంపీడీవో కొండన్న, ఎం పి ఓ, పావని, గీత, పంచాయతీ సెక్రటరీ శ్యాం సుందర్ రెడ్డి, విద్యార్థులు, విద్యార్థినిలు, పాఠశాల ఉపాధ్యాయులు గీత, నరసింహయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ :మక్తల్ పట్టణం నందు అక్షయ రెడ్డి టెక్నో స్కూల్ నందు సాంప్రదాయ దుస్తులతో విద్యార్థినీ, విద్యార్థులు రంగు, రంగుల పసుపు, ఎరుపు ఆకుపచ్చ, తంగిడి పూలతో బతుకమ్మను తయారుచేసి స్కూల్ నందు విద్యార్థిని, విద్యార్థులు ఆటపాటలతో బతకమ్మ పాటలతో, నృత్యాలు చేస్తూ, దండియాడుతూ, బొడ్డెమ్మలతో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ విద్యార్థులను ఉత్తేజపరుస్తూ బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు.అనంతరం ప్రిన్సిపాల్ ఎస్.విజయ్ కుమార్ మాట్లాడుతూ... స్త్రీ గొప్పతనానికి బతుకమ్మ ప్రతీక అని, మన ప్రకృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అందరూ ఘనంగా జరుపుకోవాలని , పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండా లని కోరారు, కార్యక్రమంలో డైరెక్టర్ అక్షయ రెడ్డి, ప్రిన్సిపల్ విజయ్ కుమార్, పాఠశాల ఇన్చార్జ్ రమ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఎప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తాం



● తహసిల్దార్ చింతా రవి

నవ తెలంగాణ - ఊట్కూర్

ఎప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండి తమ దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను తమ పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించటం తమ పరిధిలో లేని సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసిన వెళ్లి వాటిని పరిష్కరించడం జరుగుతుందని తహసిల్దార్ చింతారవి అన్నారు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా నవ తెలంగాణకు మాట్లాడుతూ ఎవరు కూడా దళారులను ఆశ్రయించకుండా అధికారుల దగ్గర పనులు ఉంటే రైతులు ప్రజలు నేరుగా కార్యాలయంలో వచ్చి అధికారుల దగ్గర పనులు చేయించుకోవాలని ఆయన ప్రజలను సూచించారు దరఖాస్తారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత కార్యాలయానికి వచ్చి పనులు చేయించుకోవాలని దరఖాస్తులను పరిశీంచారు.మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు కోసం తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో స్థలాన్ని సర్వే చేయటం జరిగిందని నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని వారి ఆదేశాల మేరకు పని చేయటం జరుగుతుందన్నారు

మండలంలో ఎన్ని చౌక ధార దుకాణాలు ఉన్నాయి. రేషన్ కార్డులు ఎన్ని ఉన్నాయి ?

జవాబు : 26 చౌక ధార దుకాణాలు ఉన్నాయి వీటిగాను 13,300 రేషన్ కార్డులు వాటిలో 4988 మంది మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సిలిండర్లు లబ్దిదారులు ఉన్నారన్నారు

నెలలో ఎన్ని రోజులు వరకు చౌక ధార దుకణాల ద్వారా ప్రజలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాల్సింది ?

జవాబు: ప్రతి నెల ఒకటో తేదీ నుండి 15 తేదీ వరకు ఉదయం ఏడు గంటల నుండి 11 గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు నిత్యవసర వసతులు పంపిణీ చేయవలసి ఉంటుంది.చౌక ధార దుకాణాలకు ప్రజలు ఎక్కువ సంఖ్యల వస్తే సమయం ఎక్కువ తీసుకోవడం జరుగుతుందన్నారు.

3. కార్యాలయంలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి ?

జవాబు: ధన్వాడ ఊట్కూర్ మండలానికి ఒక సర్వేయర్ ఉన్నారు ఏఎస్ఓ నర్వ ఊట్కూర్ మండలాలకు కలిపి ఒకరు ఉన్నారన్నారు

4. ప్రజల రైతుల నుండి ఎలాంటి సమస్యలు వస్తున్నాయి ?

జవాబు : భూ సరిహద్దులు భూ సర్వే తదితర సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు

5 వర్షాకాలంలో కూలిపోయిన ఎన్ని ఇండ్లకు నష్టపరిహారం వచ్చింది ఎన్ని దరఖాస్తు వచ్చాయి ?

జవాబు : మొదట 36 ఇల్లు కూలిపోయిన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.16500 మంజూరయ్యాయని వారి అకౌంట్లో జమ అయిందన్నారు. మరిన్ని దాదాపు 47 మంది ఇల్లు కూలిపోయాయి. దరఖాస్తు చేసుకున్నారని వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక పంపించి వారి ఆదేశాలకు పనిచేయడం జరుగుతుందన్నారు.

6 భూ రిజిస్టర్ పనులు ఎలా కొనసాగుతున్నాయి ?

జవాబు : ప్రతిరోజు 4 లేదా 5 భూ రిజిస్టర్ పనులు వస్తున్నాయని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేయడం జరుగుతుందన్నారు

7 ప్రజలకు రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి. ?

జవాబు :. ఎవరు కూడా (మధ్య వ్యక్తులకు) దళారులను ఆశ్రయించకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి అధికారుల దగ్గర పనులు చేయించుకోవాలని ఆయన సూచించారు భూమి కొనేవారు ముందుగా భూమి సర్వే చేయించుకోవాలని భూమి రిజిస్టర్ ఎవరు పేరుమీద ఉందిని తెలుసుకొని లోకల్ లో భూమి ఎవరి పేరు మీద ఉందని పరిశీలించుకోవాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటే కొనుగోలు చేసుకోవాలన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జోగులాంబ - గద్వాల
బుధవారం | అక్టోబర్ 02, 2024 | www.navatelangana.com

సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శిగా వెంకటస్వామి ఎన్నిక



నవతెలంగాణ-అలంపూర్

సీపీఐ(ఎం) అలంపూర్ పట్టణ కార్యదర్శిగా కె వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి రాజు, రేపల్లె దేవదాసు ఈదన్న లు తెలిపారు. మంగళవారం సీపీఐ(ఎం) పట్టణ మహాసభ ను అలంపూర్ లోని కేవీపీఎస్ కార్యాలయంలో నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడేళ్లకోసారి పార్టీ మహాసభలు జరుగుతాయన్నారు. మూడేళ్ల కాలంలో జరిగిన పోరాటా లను సమీక్షించి భవిష్యత్తు పోరాటాలకు రూప కల్పన చేస్తామని తెలిపారు. అందులో భాగంగా అలంపూర్ పట్టణ ఆరవ మహాసభ నిర్వహించామన్నారు.జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో ఎన్నిక ఏకగ్రీవం అయిందని అన్నారు.రానున్న కాలంలో ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని, వరద బాధితులకు ఇళ్ల స్థలాలు చూపించాలని, కందకం పుడ్చాలని, ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, మహిళలల, రైతుల, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటం చేస్తామని అన్నారు. కేంద్రంలో బిజెపి,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం నిరంతరం ఆందోళనలు చేస్తామని తెలిపారు. అనంతరం పార్టీ కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదికను సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. పార్టీ జిల్లా మహాసభలకు ఐదు మంది పార్టీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈనెల 6న అలంపూర్ మండల పార్టీ మహాసభ జరుగుతుందన్నారు. మండలంలోని పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. మండల మహాసభకు ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి పాల్గొంటారని తెలిపారు.ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నరసింహ, నాయకులు నాగరాజు, ఆశన్న సిద్దయ్య, అయ్యప్ప, మాలిక్ భాషా, రఫీ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్



నవతెలంగాణ - ధరూర్

ధరూర్ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయం దోళనకు గురవుతున్నారు. ధరూర్ మండల కేంద్రంలో జాతీయ ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు కంచేలేక ప్రమాదకరంగా ఉంది.ఫీజు బాక్స్ వైర్లు చేతికి అందేలా ఉండడంతో ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.నిత్యం వందలాది వాహనాలు, పాదాచారులు, రాకపోగా సాగి స్తూ ఉంటారు. ట్రాన్స్‌పార్మర్‌కు కంచె లేకపోవడంతో వాహనా దారులు ప్రమాద బారినపడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మూగజీ వాల విషయంలో మరింత జాగ్రత్త ఉండాల్సిన వస్తుంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడి ట్రాన్స్‌పార్మర్‌కు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. లేనిచో ఏదైనా ప్రమాదం జరిగితే మాత్రం విద్యుత్ అధికారుల బాధ్యత వహించాల్సి వస్తుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ జయంతి

- విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహణ



గట్టు : మండల కేంద్రంలో గ్రామ స్వరాజ్యం కమ్యూనిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతి సందర్భం పురస్కరించుకుని కేజీబీవీ గట్టు జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం కు ముఖ్య అతిథులుగా సీనియర్ ఫిజిక్స్ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి టీఎస్ టీవీ జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షులు రమేష్ హాజరయ్యారు. విద్యార్థులకు మెమెంటో గాంధీటోపిని బహుకరించారు.గ్రామ స్వరాజ్యం అధ్యక్షులు రాజుసాగర్ మాట్లాడుతూ గాంధీజీ అనుసరించిన సత్యం అహింస సత్యాగ్రహం అనే సన్మార్గాలను ఎంచుకొని ప్రతి ఒక్కరూ తమ జీవిత లక్ష్యసాధనలో ముందుకు పయనించాలని కోరారు. జెడ్పిహెచ్ఎస్ గట్టు, కేజీబీవీ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు గాంధీ సాహిత్యం బుక్స్ వితరణ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఫిజిక్స్ ఉపాధ్యాయులు తపాస్ మండల అధ్యక్షులు పరుశురాం, గట్టు జిల్లా పరిషత్ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నర్సింహుల గౌడ్, జూనియర్ కాలేజ్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ రాజు, ఎస్టియు మండల అధ్యక్షులు నర్సింహులు, ఉపాధ్యా యులు సుజాత, రాముడు, స్వప్న మోహన్, మౌళాలి తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు



నవతెలంగాణ : ఇటిక్యాల

ఇటిక్యాల మండలం వల్లూరు గ్రామం లో నాబార్డ్ వారి సహకారంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు కార్యక్రమాన్ని "ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్" సాసనూల్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం రోజు వల్లూరు గ్రామంలో ఏర్పాటు చేశారు. రీజనల్ మేనేజర్ వారణాసి రంజిత్ మాట్లాడుతు బ్యాంకు అందించే వివిధ రకాల సేవలు సౌకర్యాల గురించి వివరించారు. మొబైల్ బ్యాకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన అర్హులైన ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. బ్యాంక్ ఋణాలు సకాలంలో చెల్లించాలని అన్నారు. ATM Rupay card "లను వాడి సమయాన్ని ఆదా చేసుకోవాలని అన్నారు.మోసపూరిత ఫోన్ కాల్స్ వస్తే నమ్మకూడదని అన్నారు. వై .మురళి మోహన్ రెడ్డి ఖాతాదారుడు బ్యాంక్ లో ప్రతి సంవత్సరానికి 1000 రూపాయలు ఇన్సురెన్స్ చేసుకోవటం ద్వార ఆయన ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది.నామిని అయినా తండ్రి రామిరెడ్డి కి 200000/-లక్షల చెక్కును అందించటం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా (ఏ పి జి వి పి)రీజినల్ మేనేజర్ వారణాసి రంజిత్,మరియు సీనియర్ మేనేజర్ గౌతమ్ రెడ్డి, కౌన్సిలర్ బి .సురేశ్ రెడ్డి జనరల్ బి.డి.యం నరేశ్, బ్రాంచి మేనేజర్ రాఘవేందర్ రెడ్డి ఫీల్డ్ ఆఫీసర్ సాయికుమార్, మరియు బ్యాంకు మిత్రుల బృందం పాల్గొనడం జరిగింది.

డీజిల్ లేక నిలిచిపోయిన గ్రామపంచాయతీ ట్రాక్టర్



నవతెలంగాణ-గట్టు

మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో గత పది రోజుల నుంచి గ్రామంలోని చిత్త సేకరణ ఎక్కడ పడితే అక్కడ చెత్త చేరి పోయింది. గ్రామాలలోని డ్రైనేజీ కాలువలు కూడా నిండి కాలువలు రోడ్లపై నీరు ఊరికి నెరవేరుతుంది కానీ కార్యదర్శి మాత్రం చూసి చూడనట్టుగా వదిలేస్తున్న రోడ్ల పక్కన రోడ్లమీద ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకు పోయింది కానీ పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడంలేదని గ్రామస్తులు అంటున్నారు కనుక అధికారులు స్పందించి వెంటనే చిత్త సేకరణ చేయించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

సరితమ్మకు కృతజ్ఞతలు

- బోయలగుడెం 107 ప్యాకేజీ రైతులు



నవతెలంగాణ - గట్టు

గట్టు మండల పరిధిలోని బోయలగుడెం గ్రామానికి చెందిన రైతులు ఇందువాసి బోయలగుడెం గ్రామాల మధ్య 107 ప్యాకేజీ క్రింద పొలాలు నష్ట పరిహారం రైతుల ఖాతాలో జమ చేయుట కోసం కృషి చేసిన జెడ్పి మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత తిరుపతయ్య గారికి బోయలగుడెం గ్రామానికి చెందిన రైతులు కాంగ్రెస్ పార్టీ సరితమ్మ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి,పుష్పగుచ్చాం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.మంగళవారం పట్టణ శివారులో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న పనులు, వాటి పురోగతిపై వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందృంగా కలెక్టర్ మాట్లాడుతూ, అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కళాశాల వసతులకు అనుగుణంగా, జి ప్లస్ వన్ నిర్మాణం పూర్తి చేయాలని, తరగతి గదులు,ల్యాబ్‌లు మొదలైన విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రాజెక్ట్ మ్యాప్ ద్వారా ప్రాజెక్ట్ వివరాలను కలెక్టర్ పరిశిలించారు. పనులు అన్ని నిర్దేశిత ప్రమాణాల ప్రకారం, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.అంతకు ముందు పాత ఎస్సీ కార్యాలయం, గంజిపేటలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలను సందర్శించి, అన్ని తరగతులు, ల్యాబ్‌లు పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కళాశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారని, ద్వితీయ, తృతీయ సంవ త్సరాల విద్యార్థులు పాత ఎస్సీ కార్యాల యంలో ఉంటుం డగా, మొదటి సంవత్సరం విద్యార్థులు గంజిపేటలో ఉంటున్నారని ప్రిన్సిపాల్ వివరించారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించి, వారికి మెరుగైన వస"తులు కల్పించేందుకు ప్రిన్సిపాల్,సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలను వివరించారు.కొత్త ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణం కొద్ది నెలల్లో పూర్తవుతుందని,అప్పటి వరకు కొత్త బ్యాచ్ నర్సింగ్ విద్యార్థులకు గంజిపేటలో తాత్కాలికంగా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, నిర్మాణం పూర్తయ్యాక అన్ని మౌలిక వసతులతో కూడిన కొత్త ప్రాంగణానికి విద్యార్థులను తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతమ్మ ,టి. జి ఎం ఎస్ ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జైపాల్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సురేష్, ఎ.ఈ రహీముద్దీన్, కళాశాల సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

వృద్ధుల పట్ల గౌరవంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి గంటా కవితా దేవి అన్నారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ అందరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి గంటా కవితా దేవి ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడుతూ, వయోవృద్ధుల విజ్ఞానం వారి అనుభము నేటి తరానికి మార్గదర్శకంగా ఉండాలన్నారు. ఎలాంటి ఒత్తిడికు లోనూ కాకుండా కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని, ఎదైన సమస్య ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఎల్లవేళల తోడుగా ఉంటుందని అన్నారు. పిల్లలు వారి తల్లి దండ్రులకు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తే వారి పోషణ నిమిత్తం జిల్లాలోని ఆర్డీఓ లేదా జిల్లా సంక్షేమ శాఖ అధికారి, తహంల్దార్ కార్యాలయంలో వారిపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లేదా నేరుగా కోర్టుకు దరఖాస్తు చేసుకు ంటే వారి పట్ల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు మాట్లాడుతూ, అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు వయవృద్ధులతో అనేక రకాలైన కార్యక్రమాలు నిర్వహించడం జరిగినదని తెలిపారు. ఇందులో భాగంగా అందరూ కూడా చాలా ఉత్సాహంగా పాల్గొన్నారని, నేటి రోజుల్లో చిన్న కుటుంబాలు ఏర్పడడం వల్ల మానవతా విలువలు తగ్గిపోయాయని తెలిపారు. గతంలో ఉమ్మడి కుటుంబాల వలన మంచి చెడులు చెప్పేవారు ఉండేవారని,నేటి సమాజంలో చిన్న కుటుంబాలుగా విడిపోయినందున వారికి మంచి చెడు చెప్పే పెద్దవారు లేకపోయారన్నారు. పిల్లలందరికీ పెద్దలను గౌరవించడం మరియు మానవతా విలు వలను పెంపొందించుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, నేటి యువత వృద్ధులు, తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉండాలని వారిని చిన్నచూపు చూడకూడదని, వారిపట్ల నిర్లక్ష్య ధోరణి చూపరాదని వారిని ప్రేమ ఆప్యాయతతో చూసుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని అన్నారు.వృద్ధుల అనుభవాలు వారి జ్ఞానం నవ సమాజానికి మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు.

భారతదేశంలో సంస్కృతీ సంప్రదాయాలకు ఎక్కువ విలువ ఇస్తారనీ, కొన్ని కారణాల వల్ల కుటుంబాలు దూరం అయిపోతున్నాయని, మానవతా విలువలు తగ్గుపోతున్నాయని, ఇలాంటి తరు ణంలో పెద్దలని గౌరవించి ప్రేమను పంచాలని కోరారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన సీనియర్ సిటిజన్స్ కు మేమెంటోలు, శాలువలతో సన్మానం చేయడం జరిగింది. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్, ఇంచార్జి డీడబ్ల్యూవో సుజాత, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ వినోద్, సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు బాలకిషన్, అచ్చన్నగౌడ్, రామలింగయ్య, సాయిబాబా, సుధాకర్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం : జిల్లా ఎస్పీ



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

మహిళలు,యువతులు,బాలికలు ఆకతాయిల వలన గానీ,మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు.విద్యార్థినులు,మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్,ఈవ్ టీజింగ్ లకు గురైనా,మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా,బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని ఎస్పీ తెలిపారు.షీటీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ సెప్టెంబరు మాసంలో 93 హాట్స్పాట్స్ ను సందర్శించడం జరిగిందనీ, పిర్యాదులు 02 రాగా ,10 రెడ్ హ్యాండెడ్ కేసులు,10 పెట్టి కేసు లు,12 కౌన్సిలింగ్ లు చేసి 05 అవగహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింద ని అన్నారు. మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించా లని,వాటిలో ఫోటోలు,వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.నేరుగా సంప్రదించలేని వారు షిటీం 8712670312 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుం దని తెలిపారు.విద్యార్థినులు,మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.జిల్లాలో కళా బృందాల ద్వారా కూడా షి టీం అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యం చెయ్యడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్: సిఐ నాగేశ్వర్ రెడ్డి

- మద్దెల బండ గ్రామంలో ముమ్మర తనిఖీలు
- 40 వాహనాల స్వాధీనం



మల్దకల్ :మండలం మద్దెలబండ గ్రామంలో రాత్రి చేసిన శాంతి భద్రతల పరిరక్షణ కార్డన్ సర్చ్ లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణకు, భద్రతపై ప్రజలకు భరోసా కల్పించడానికే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సిఐ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మల్దకల్ మండలంలోని మద్దెల బండ గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై నందికర్ ఆధ్వర్యంలో సిఐ నాగేశ్వర్ రెడ్డి కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా తనిఖీల్లో భాగంగా ఎలాంటి ధృవీకరణ పత్రాలూ లేని 40 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా సీఐ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నేరా లను నియంత్రించేందుకు, నిందితులను గుర్తించేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 24/7 నిఘా కోసం బ్లూకోల్ట్స్, పెట్రోకార్ బృందాలను ప్రారంభించామన్నారు. ఈ బృందాల ద్వారా ప్రజల భద్రత కోసం నిరంతరం పె ట్రోలింగ్ నిర్వహించడంతో పాటు నేరస్థుల కదలికపై నిఘా కొనసాగిస్తామని చెప్పారు. పటిష్టమైన నేర నివారణ చర్యల్లో భాగంగా గ్రామంలోని అందరూ కలిసి ముఖ్యకూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అత్యవసర సమయంలో డయల్ 100కు గానీ, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపరాదని వాహనాలను అధిక వేగంతో నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవదన్నారు. ప్రమాదాలు జరగకుండా రోడ్డు నిబంధనలను తప్పక పాటించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపరాదని, అనుకోకు ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోవడం జరుగుతుందన్నారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎల్లవేళలా హెల్మెట్ ధరించుకొని వాహనం నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సుకూర్, కళ్యాణ్ కుమార్, బాలచంద్రుడు, చంద్రకాంత్, తదితర 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి: ఎమ్మెల్యే



నవతెలంగాణ - జోగులంబ గద్వాల

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికీ ఎప్పుడు చర్యలు తీసుకోవాలని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మిషన్ భగీరథ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొన్ని రోజుల నుండి గట్టు మండలంలోని పలు గ్రామాలలో ప్రజలకు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మిషన్ భగీరథ ద్వారా నీటి ప్రెజర్ ఎక్కువ కావడంతో సరైన నీటి సౌకర్యం అందగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ఈ సమస్యలపై దృష్టి సాధించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.మిగతా ప్రాంతాల్లో ఎప్పటికీ అప్పుడు పర్యవేక్షణ చేపట్టాలన్నారు.అనంతరం గద్వాల మిషన్ భగీరథ నూత న ఎస్ఈ గా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ ఎమ్మెల్యేను శాలువా కప్పి పుష్ప గుచ్ఛం ఇచ్చి సత్కరించారు. మిషన్ భగీరథ అధికారులు సానుకూలంగా స్పంది ంచి ఎమ్మెల్యే చెప్పిన మాట ప్రకారం రెండు మూడు రోజుల్లో మరమ్మత్తులను పూర్తి చేసి కొత్త మోటర్ ను ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సౌకర్యం కల్పించి భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మిషన్ భగీరథ ఈఈలు పరమేశ్వర్, శ్రీధర్ రెడ్డి,డి రవిచంద్ర పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ- గట్టు

మండల పరిధిలోని బుచ్చనపల్లి గ్రామంలో ఎంపీపీ ఎస్ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు పాఠశాల వనంలోని బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థులు చేత బొడ్డెమ్మ డ్యాన్సులు ఆటపాటలతో పాఠశాల వర్ణం నిర్వహించారు . కార్యక్రమంలోని విద్యార్థు లు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధరూర్:మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలను శ్రీ లక్ష్మీ కాన్సెప్ట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు పాఠశాలలకు దసరా సెలవుల ముందు రోజైనా మంగళవారం విద్యార్థినీలు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారుచేసుకుని అలంకరించుకొచ్చారు.చిన్నారుల వస్త్ర వేషధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరము బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

ధరూర్ : మండలం పరిధిలో ఇండో ఇంగ్లీష్ యాజమాన్యం సుబ్బు ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు విద్యార్థి విద్యార్థులచే ఉపాధ్యాయులు పాల్గొని బతుకమ్మ బోనం నెత్తిన పెట్టుకొని ఇండో ఇంగ్లీష్ స్కూల్ ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గజేంద్ర రెడ్డి, శీబు, స్కూల్ యాజమాన్యం,డ్రైవర్లు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





మల్దకల్: మండలం పెద్దదొడ్డి ప్రాథమిక పాఠశాలలో గౌరవ మండల విద్యాశాఖ అధికారి శ్రీ జి సురేష్ జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీ హంపయ్య గారి చేతుల మీదుగా విద్యార్థులకు రెండవ జత ఏకరూప దుస్తుల పంపిణీ చేశారు.ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ దసరా సెలవులను చక్కగా వినియోగించుకోవాలని, చదవడం రాయడంలో నైపుణ్యాలను పెంచుకోవా లని సూచించారు. అనంతరం బడి పిల్లలు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చడం జరిగి ంది. విద్యార్థులు కోలాటలతో దగ్గరిలో ఉన్న కాలవలో బతుకమ్మ ను నిమ్మజ్జనం చేశారు.కార్యక్రమంలో పాఠశాల స్కూల్ హెడ్మస్టర్ వెంకటయ్య, ఉపా ధ్యాయులు చక్రధర్,నాగరాజు, అంగనవాడీటీచర్లు ధర్మవతమ్మ, సుమలత పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల అభినందనలు



నవతెలంగాణ - మల్దకల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా ఈరోజుప్రాథమిక ఆరోగ్య కేంద్రం దేవాలయ పరిసరాలలో ప్లాస్టిక్ చెత్త చెదారం తొలగించి వాటి వలన కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కలిగించారు.ఈ సందర్భంగా వాలంటీర్లు దాదాపు 5 కిలోల ప్లాస్టికును సేకరించి పారిశుద్ధ కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామాంజనేయులు గౌడ్ ,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం

నవతెలంగాణ -మల్దకల్

మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మండలానికి సంబంధించిన అన్ని గ్రామ పంచాయతీల యొక్క గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం మంచి నీటి నాణ్యతను పరీక్షించే విధానాన్ని ల్యాబ్ టెక్నీషియన్స్ అన్వర్ నవీన్ లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి శ్రీ వెంకటరమణ సూపరిండెంట్ ఇంజనీర్ (ఎస్ ఈ), శ్రీ శ్రీధర్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈ ఈ), పరమేష్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏ ఈ ఈ)మల్దకల్ మండలం పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీ లో పనిచేసే మంచినీటి సహాయకులు మరిచారన్నారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

గద్వాల జిల్లా యందు 2024-25 విద్యా సంవత్సరం గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనములకు అర్హులైన ఎస్సీ విద్యార్థిని/విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డి.సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా నూతన విధివిధానాలను "e-pass%μμ వెబ్సైట్ నందు మార్పు చేసినట్లు తెలిపారు. మొదటగా విద్యార్థి ఇంటర్నెట్ నందు ఎస్ఎస్సి , ఆధార్ కార్డు వివరాలతో తాత్కాలిక ఈ-పాస్ ఐడి 12 అంకెలతో ఇవ్వబడుతుందని, ఎస్ ఎస్ సి మెమొలో ఉన్న వివరాలు ఆధార్ వివరాలకు సరిగ్గా లేని పిదప దగ్గరలో ఉన్న మీ సేవ కేంద్రాల్లో ఆధార్ వివరాలు సరి చేసుకోవాలని అన్నారు. తదుపరి ఈ -పాస్ ఐడి నెంబర్ తో దగ్గరలోని మీసేవ కేంద్రం వద్ద బయోమెట్రిక్ వేయవలసి ఉంటుందని, బయోమెట్రిక్ అనంతరం విద్యార్థి ఇంటర్నెట్ సెంటర్ ను సంప్రదించి పూర్తిస్థాయిలో నమోదు పూర్తి చేసి తర్వాత సంబంధిత కళాశాలలో సమర్పించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపల్ మరియు యాజమాన్య ప్రతినిధులు తమ విద్యార్థులకు నమోదు ప్రక్రియ పైన అవగాహన కల్పించాలని ఆమె కోరారు.